**మంచిమాట**

తమ సమస్యలను నీతో పంచుకునే వారిని చిన్నచూపు చూడకు... నీకు చెప్పడం వారు అసమర్థులై కాదు, నీమీద నమ్మకంతో.


నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 25 సంచిక : 47 బుధవారం, నవంబర్ 12, 2025 , పేజీలు - 12 వెల : 2/-


## బాంబు దాడి నిందితులను వదలబోం

**భూటాన్ పర్యటనలో ప్రధాని మోడీ హెచ్చరిక**

**బాధాతప్త హృదయంతో ఇక్కడికి వచ్చానని వెల్లడి**




## ఆ ముగ్గురి కలయికతో అద్భుతమైన ప్రగతి

- ఇకనుంచి అంతా నన్ను మామా అని పిలవండి
- గుంటూరు జిల్లా పర్యటనలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్



తొలి అక్షరం/గుంటూరు,నవంబర్ 11: ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలయిక అద్భుతమని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కొనియాడారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లాలో పర్యటించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా2లో...

## 14 వరకు నేరుగా హాజరు కావాల్సిందే

- జగన్‌కు సిబిఐ కోర్టు ఆదేశం



హైదరాబాద్,నవంబర్11: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న పిటిషన్‌పై హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ అభ్యర్థనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. దీంతో వ్యక్తి గత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న మోమోను జగన్ తరఫు న్యాయవాది వెనిక్కి తీసుకున్నారు. కొంత సమయం ఇస్తే వ్యక్తిగతంగా విచారణకు హాజరవుతారని చెప్పారు. ఇందుకోసం వారం రోజులు సమయం ఇవ్వాలని జగన్ తరపు న్యాయవాది కోరగా.. మిగతా2లో...

# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

- పాడెమోసి ప్రేమ చాటుకున్న సిఎం రేవంత్
- హాజరైన పలువురు నేతలు..మంత్రులు..కళకారులు
- పోలీసుల గౌరవ వందనం మధ్యఅంత్యక్రియలు పూర్తి
- అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం
- ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా..
- పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాసా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,నవంబర్11: అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అందెశ్రీ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనా రాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొ న్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు మిగతా2లో...



## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు అవసరం

**ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ ఆశాభావం**

అమరావతి, నవంబర్ 11: సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. సెక్యులరిజం రెండు మార్గాల్లో ఉంటుందని, మత విశ్వాసాల రక్షణ, గౌరవం అంశంలో రాజీ ఉండదని ఆయన అన్నారు. మన సనాతన ధర్మం అత్యంత ప్రాచీనమైందని, నాగరికతతో ఆ ధర్మం వర్ధిల్లుతున్నదని, ఇలాంటి సమయాల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఎక్స్ అకౌంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా2లో...

## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

- తిరుగులేని ఆధిక్యంతో కాంగ్రెస్ విజయం
- క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాం
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ధీమా



హైదరాబాద్,నవంబర్11: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో...కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల మిగతా2లో...



## జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్

- సాయంత్రం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదు
- క్యూ లైన్‌లో ఉన్న వారికి ఓటేసే అవకాశం
- షేక్‌పేట డివిజన్‌లో పోలీసుల లాఠీఛార్జి
- పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు

హైదరాబాద్,నవంబర్11: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. గత పక్షం రోజులుగా హోరాహోరీ ప్రచారం చేసి, ఓట్లను అర్థించిన ఓటర్లు పెద్దగా స్పందించ లేదు. మిగతా2లో...

## నక్కలగండి పూర్తికాక తీవ్ర ఇబ్బందులు

- సాగర్ తలాపున ఉన్నా నీటి గోస తప్పడం లేదు
- నక్కలగండి నిర్వాసితులతో కవిత సమావేశం



నల్గొండ,నవంబర్11: నాగార్జున సాగర్ ప్రాజెక్టు తల మీద ఉన్నా నల్గొండ జిల్లాలోని కొన్ని మండలాలకు ఇప్పటికీ నీరు అందడంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నక్కల గండి ప్రాజెక్టు సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. కేసీఆర్ గత ఉప ఎన్నికల ముందు నెల్లికల్ లిఫ్ట్ పనులు ప్రారంభించినా అప్పటి జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి ఏడాదిలో పూర్తి చేస్తామని లేకుంటే రాజీనామా చేస్తామని వాగ్దానం చేశారని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నెల్లికల్ లిఫ్ట్ ప్రాజెక్ట్ ను పూర్తి చేయకపోవడం దారుణమని చెప్పారు. పత్తి రైతులు గత ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్ముకున్నారని.. పత్తి రైతుల కోసం సీసీఐ నిబంధనలు మిగతా2లో...

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల బెదరింపులు

- మహిళ అని కూడా చూడకుండా హేళన
- ఓటమి భయంతోనే ఆగడాలకు దిగారన్న సునీత




హైదరాబాద్,నవంబర్11: జూబ్లీహిల్స్‌లో ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించారని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని బెదిరింపులకు దిగుతూ.. మాట వినకపోతే బూతులు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అభ్యర్థి అని చూడకుండా బూతులు మాట్లాడతారా అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న రౌడీయిజం భరించలేక మాగంటి సునీత ఉద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ గూండాల బెదిరింపులకు ఓటర్లు భయపడవద్దని సూచించారు. విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో మిగతా2లో...

## వరద బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం

**రూ.12.99 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు**



హైదరాబాద్,నవంబర్11: మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా2లో...

## అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)

అర్పించారు. అందెశ్రీ పార్థీవ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఆప్తుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తి శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను.. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీని కలిసినప్పుడల్లా సొంత అన్నను కలిసినట్టుగా ఉండేదన్నారు. గద్దర్ తో పాటు అందెశ్రీ పాటు తెలంగాణ ఉద్యమానికి ఎంతో బలాన్ని ఇచ్చాయని అన్నారు. అందెశ్రీ జయజయహే పాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందని.. అందుకే జయజయహే పాటను రాష్ట్ర గీతంగా గుర్తించామని తెలిపారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందెశ్రీ వ్యక్తిగతంగా తన మనసుకి దగ్గరి వ్యక్తి అని.. ఆయన లేని లోటు నా కుటుంబానికి వ్యక్తిగతంగా తీరని లోటన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని కానీ అవార్డు రాలేదన్నారు. ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని.. ఆయనకు పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## బాంబు దాడి నిందితులను వదలబోం

న్యూఢిల్లీ, నవంబర్ 11: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లో నూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలిచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోడీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దు:ఖాన్ని అర్థం చేసుకున్నాం. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు సూత్రధారులను విడిచిపెట్టబోం. కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం. ఇప్పటికే ఉగ్ర కుట్ర మూలాలను గుర్తించాం. ఢిల్లీ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాం. పేలుడుపై అర్ధరాత్రి వరకు సమీక్షలు చేస్తూనే ఉన్నాం. బాధితుల వెంట దేశమంతా ఉందని మోడీ తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోడీ మంగళవారం ఉదయం భూటాన్ వెళ్లారు. పర్యటన ముగించుకుని బుధవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5:30 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పోలింగ్ సమయం ముగిసే నాటికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. యూసుఫ్‌గూడ మహబూబ్ ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓట్ల విషయంలో నిలదీసిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. ఇరు పార్టీల నేతలకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా పోలింగ్ దాదాపు 50 శాతం వరకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మాత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా షేక్‌పేట డివిజన్ లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పోలీసులు రంగంలోకి దిగి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. అక్కడ పోలింగ్ బూత్‌లు 4, 5, 6, 7, 8 వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. వాళ్లు హడావిడి చేయడంతో పోలీసులు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు.. కానీ, గులాబీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. పలువురు కార్యకర్తలను బూత్ ఏరియాస్ నుంచి చెదరగొట్టడానికి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఉద్రిక్తత వెనుక నాన్-లోకల్స్ ఇష్యూ ఉంది.. ఎన్నికల నిబంధనల ప్రకారం? నాన్-లోకల్స్ నియోజకవర్గంలో తిరగకూడదు. అయినప్పటికీ, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు బూత్‌ల వద్దకు వచ్చి హడావిడి చేస్తూ? ఓటర్లను ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ జరగడంతో పోలీసులు ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయాల్సి వచ్చింది. ఒకవైపు ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా సాగుతుంటే? మరోవైపు బస్తీలలో ఓటర్లను డబ్బులతో ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డబ్బులు అందకపోవడం వల్ల కూడా ఓటర్లు ఓటింగ్‌కు రావట్లేదని ఓపెన్‌గా మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆ ముగ్గురి కలయికతో అద్భుతమైన ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

మధ్యప్రదేశ్‌లో ప్రజలు నన్ను మామ అని పిలుస్తారు.. ఇకపై ఏపీ వారికి కూడా నేను మామనే అని వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు వద్ద వాటర్ షెడ్ పథకం కింద రూ.1.20 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మొక్కలు నాటారు. బావిలో నుంచి స్వయంగా నీళ్లు తోడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెంగళాయపాలెం చెరువు పునరుద్ధరణ చూశాక చాలా సంతోషం వేసిందని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. పురాతన చెరువును అత్యాధునికంగా తీర్చిదిద్దారని తెలిపారు. దీనిద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. పశువులకు తాగునీరు లభిస్తుందని అన్నారు. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి చెరువును ఉపయోగించవచ్చన్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్ వంటివి ప్రజలకు ఆనందాన్ని ఆరోగ్యాన్ని పంచుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో చెరువుల పునరుద్ధరణ చేస్తానని మాటిచ్చారు. కేంద్రమంత్రి హోదా కంటే కూడా ప్రజలకు సేవ చేయడం కోసమే ఆంధ్రాకు వచ్చానని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రజా సేవను దైవ పూజగా భావిస్తానని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నన్ను మామ అని అంటారని.. ఇకపై ఏపీ ప్రజలకు కూడా నేను మామనే అని వ్యాఖ్యానించారు.

## 14 వరకు నేరుగా హాజరు కావాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఈనెల 21 వరకు న్యాయస్థానం సమయం ఇచ్చింది. యూరప్ పర్యటనకు వెళితే ఈ నెల 14వరకు కోర్టుకు హాజరు కావాలని గతంలోనే సీబీఐ కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం కోసం ఆ బోర్డు ఉండాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం యాత్రా స్థలం మాత్రమే కాదు అని, అది పవిత్ర ఆధ్యాత్మిక యాత్రకు కేంద్రమని, తిరుపతి లడ్డూ కేవలం స్వీటు మాత్రమే కాదు అని, అదొక భావోద్వేగం అన్నారు. మన స్నేహితులు, కుటుంబీకులు, దగ్గరవారికి ఆ లడ్డూను ఎంతో ప్రేమతో పంచిపెడుతామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మనలో ఉన్న సామూహిక నమ్మకానికి, విశ్వాసాన్ని చాటుతుందన్నారు. ప్రతి ఏడాది సగటును 2. 5 కోట్ల మంది భక్తుల తిరుమలను దర్శించుకుంటారని, సనాతన విధానాలు అవలంబిస్తున్న వారి మనోభావాలను దెబ్బతీయాలని చూసినా, లేక హేళన చేసినా, అది కేవలం బాధను మాత్రమే కలిగించదు అని, లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసినట్లు అవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఎక్స్‌లో తిరుపతి లడ్డూపై ఓ పత్రిక రాసిన కథనాన్ని రీపోస్టు చేశారు. టీటీడీ లడ్డూ తయారీ కోసం ఉత్తరాఖండ్‌కు చెందిన డెయిరీ సంస్థ నెయ్యి సరఫరాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆ కథనం పేర్కొన్నది. ఒక్క పాలచుక్కను కూడా సేకరించని ఆ సంస్థ ఎలా 68 లక్షల కేజీ నెయ్యిని సరఫరా చేసిందని కథనంలో ప్రశ్నించారు. 2019 నుంచి 2024 వరకు ఆ డెయిరీ సంస్థ సుమారు 250 కోట్ల ఖరీదైన నెయ్యిని టీటీడీకి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## సునీత వ్యాఖ్యలు సత్యదూరం

- సానుభూతి పొందే ప్రయత్నం
- తిప్పికొట్టిన మంత్రి పొన్నం



హైదరాబాద్,నవంబర్11: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రశాంతంగా కొనసాగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి 40.20 శాతం నమోదయ్యింది. తమను పోలింగ్ స్టేషన్ల దగ్గరకు రాకుండా అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. ఈ క్రమంలో సునీత వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాజకీయ సానుభూతి ప్రకటనలు కురిపిస్తు న్నారని అన్నారు. సునీత వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంగించి నట్లేనని అన్నారు పొన్నం. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు పొన్నం. ప్రజలు తమ ఇష్టానుసారం ఓటు వేసే హక్కు ఉందని.. పోలింగ్ టైంలో స్థానికేతర నేతలు ఉంటే కేసు పెట్టాలని అన్నారు. అయితే.. ఉదయం పోలింగ్ కాస్త నెమ్మదిగా జరిగినా.. గంట గంటకి నెమ్మదిగా ఓటింగ్ శాతం పెరుగుతోంది. మధ్యాహ్నం వచ్చే వరకు పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి వరకు 40.20 శాతం పోలింగ్ నమోదయ్యింది. చివరి రెండు గంటల్లో సాయంత్రం 4 నుంచి 6 వరకు పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారుల అంచనా వేస్తున్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతోంది.

## నక్కలగండి పూర్తికాక తీవ్ర ఇబ్బందులు

(మొదటి పేజీ తరువాయి)

సడలించాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లాలో అధికంగా ఉన్న పత్తి రైతుల కష్టాలు జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతి పక్ష పార్టీ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మునిగిపోయారు తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని దుయ్యబట్టారు. ఎన్టీఆర్ హయాంలో రూపకల్పన చేసిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు ఆధారంగా నక్కల గండి ప్రాజెక్ట్ కట్టాలని నిర్ణయించారు. 2009లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 545 కోట్లతో ప్రాజెక్ట్ ప్రణాళిక సిద్ధం చేసింది. అప్పటికీ తెలంగాణ ఉద్యమం సాగుతుండటంతో పనులు జరగలేదు. తెలంగాణ వచ్చే వరకు కూడా ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగాయి. తెలంగాణ వచ్చాక 8 కిలోమీటర్ల వరకు టన్నెల్ తవ్వే ప్రయత్నం జరిగింది. కానీ సాంకేతిక కారణాలతో ప్రాజెక్ట్ పనులను ఆపాల్సి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సాంకేతిక లోపాలను పట్టించుకోలేదు. దాంతో పెద్ద ప్రమాదం జరిగి 8 మంది చనిపోయారు. ఇప్పటికి నక్కల గండి సహా మరో రెండు తాండాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. మొథ్యా తాండా ప్రజల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అసలు ఈ ప్రభుత్వం ఎస్ఎల్ బీసీని ఎప్పుడు పూర్తి చేస్తుందో చెప్పాలి’ అని కవిత డిమాండ్ చేశారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని మాగంటి సునీత అన్నారు. స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా జూబ్లీహిల్స్‌లో తిరుగుతున్నారని తెలిపారు. సురేశ్ యాదవ్ అనే వ్యక్తి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తిరగాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ఏజెంట్లు కూర్చుంటే వాళ్లను కూర్చోనివ్వడం లేదని తెలిపారు.పోలింగ్ బూతుల్లోని టేబుళ్లను బయట పడేస్తున్నారని తెలిపారు. పోలీసులు వారి దగ్గరి టేబుల్స్, చైర్లు లాక్కొని దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. బిర్యానీల్లో డబ్బులు పెట్టి ఓటర్లకు ఇస్తున్నారని చెప్పారు. బిర్యానీ ప్యాకెట్లను చూసి కూడా పోలీసులు వదిలేస్తున్నారని తెలిపారు. కొన్ని బూత్‌ల్లో రిగ్గింగ్ చేస్తున్నారని ఆరోపించారు. వికలాంగులకు వీల్‌చైర్స్ కూడా సరిపడేంతగా పెట్టలేదని తెలిపారు. రజియా అనే అమ్మాయి ఇంటికి వెళ్లి దాడులకు దిగుతున్నారని అన్నారు. ఓటింగ్‌కు ఇంకా నాలుగు గంటల సమయం ఉండగా.. దయచేసి ప్రజలంతా బయటకొచ్చి ఓట్లు వేయాలని మాగంటి సునీత కోరారు. జూబ్లీహిల్స్ ఓటర్లు చైతన్యం ప్రదర్శించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని రౌడీరాజ్యంగా మార్చేశారని తెలిపారు. నవీన్ యాదవ్ మనుషులు వచ్చి రేపు నీ సంగతి చెప్తానని నన్నే బెదిరించారని పేర్కొన్నారు. ఇలాంటి రౌడీ రాజ్యాన్ని అడ్డుకోవాలంటే కేసీఆర్ పార్టీని గెలిపించాలని కోరారు.

## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్ట పడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతోపాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## వరద బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం

(మొదటి పేజీ తరువాయి)

పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన వెలిచాల రాజేందర్ రావు

### జూబ్లీహిల్స్ ఎన్నికలపై మానిటరింగ్



హైదరాబాద్ :హైదరాబాదులో బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎన్నికలపై మంత్రితో చర్చించారు. ఓటింగ్ శాతంపై మానిటరింగ్ నిర్వహించారు. ఉదయం నుంచి నమోదైన పోలింగ్ శాతం వివరాలను రాజేందర్ రావు మంత్రికి వివరించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారనీ, నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని రాజేందర్రావు ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్ కు ఓటర్లు పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను ప్రపంచవ్యాప్తంగా పెంచడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నవీన్ యాదవ్ విజయంతో కాంగ్రెస్ పార్టీలో రెట్టింపు ఉత్సాహం నెలకొంటుందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురులేదని జూబ్లీహిల్స్ ఎన్నికతో రుజువు అవుతుందని వెలిచాల రాజేందర్ రావ్ పేర్కొన్నారు.

## హుస్నాబాద్ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కమ్యూనిస్టు యూదుడు సిపిఐ మాజీ శాసనసభ్యుడు దేశిని చిన్న మల్లయ్య గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి





చర్చ:- హుస్నాబాద్ : తెలంగాణలో గౌడ కల్లుగీత కార్మికుల సమస్యల కోసం సంఘాన్ని స్థాపించి పోరాడిన పేద వర్గాల పక్షపాతి ఇందుర్తి నియోజకవర్గం నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గౌడ ముద్దుబిడ్డ తొలి రైతాంగ సాయుధ పోరాట యోధులు సర్పంచ్ నుండి మొదలుకొని ఎమ్మెల్యే వరకు బలహీన వర్గాల మద్దతుతో గెలిచి ఎప్పుడు పేద వర్గాల సంక్షేమం కోసం పరితపించిన బహుజన నాయకుడు స్వర్గీయ శ్రీదేశిని చిన్న మల్లయ్య ఎన్ని పదవులు అలంకరించిన సామాన్యులు ధరించే ధోతి లాల్చీని వాడి సాదాసీదా జీవితాన్ని మాత్రమే గడిపాడు నమ్ముకున్న సిద్ధాంతాన్ని ఏనాడు మరువకుండా ప్రజాసేవ కోసం నిరంతరం పనిచేశాడు వెనుకబడిన ఇందుర్తి నియోజకవర్గంలో వేల ఎకరాల భూములను పేదలకు పంచాడు గూడు లేని నిరుపేదలకు ఎమ్మెల్యే కోటాలో ఇండ్లను నిర్మించి ఇచ్చాడు ఎమ్మెల్యేగా ఉండి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవాడు ప్రతి ఒక్కరిని ప్రేమతో ఆప్యాయతో వరుసలు కలిపి పలకరించేవాడు దేశిని చిన్న మల్లయ్య ఈ ప్రాంతానికే కాకుండా యావత్ రాష్ట్రానికి ఆదర్శం తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారు

## మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి





చర్చ :- కరీంనగర్ : మొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం ఆయన జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వారి సేవలకు గుర్తుగా ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్స వంగా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఆధునిక విద్యావ్యవస్థకు పునాది వేశా రన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లు ఏర్పాటు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మైనారిటీ సంక్షేమ అధికామైనారిటీ సంక్షేమ అధికారి, డీఆర్ఓ బి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు

## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



చర్చ, కొత్తగూడెం :డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరు కలసికట్టుగా కృషి చేద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పిలుపునిచ్చారు. మంగళవారం చైతన్యం, డ్రగ్స్ పై యుద్ధం పేరిట సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ నుండి ఇల్లందు క్రాస్ రోడ్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రహమాన్, చుంచుపల్లి మండల సిపిఐ కార్యదర్శి వాసిరెడ్డి మురళి,సుజాత నగర్ మండల సిపిఐ కార్యదర్శి హనుమంత్ రావు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వాడకంతో చాలా మంది యువత పెడదోవపడుతున్నారని, మత్తులో నేరాలు చేస్తూ జైలుకు వెళుతున్నారన్నారు. డ్రగ్స్ను అరికట్టడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు.

## సిద్దిపేట జిల్లా కోహెడ మండలం జాతీయ రహదారిపై ప్రమాదం

### కరీంనగర్ నుండి గజ్వేల్ వెళ్తుండగా ప్రమాదం



చర్చ:- కోహెడ : కరీంనగర్ నుండి గజ్వేల్ తాసిల్దార్ కార్యాలయానికి విధులకు వెళుతుండగా గజ్వేల్ తహసిల్దార్ శ్రవణ్ మంగళవారం తన కారులో డ్రైవ్ చేసుకుంటూ వస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో కోహెడ మండలం శంకర్ నగర్ ప్రధాన జాతీయ రహదారి వద్ద కారు అదుపుతప్పి కల్వర్టును ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ తహసిల్దార్ శ్రావణ్ కు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

## విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:భారత రత్న, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ జీవితంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీల సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా, అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యా చందన లతో కలిసి హాజరై మౌలానా



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### విద్యకు పునాది వేసిన దార్శనికుడు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు అపారమైనవి. ఆయన దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా భారత విద్యా విధానానికి బలమైన పునాది వేశారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లల విద్యకు మార్గం చూపారు," అని పేర్కొన్నారు. మౌలానా ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, రచయిత, విద్యావేత్తగా దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు.

### విద్యతోనే దేశాభివృద్ధి

దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా ప్రోత్సాహానికి అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. అర్హులందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలి," అని కలెక్టర్ సూచించారు.భారతీయులు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారంటే, దానికి పునాది మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చూపిన విద్యా దార్శనికతేనని తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, బీసీ వెల్ఫేర్ అధికారి విజయలక్ష్మి, ఐడిఓసి అధికారులు, సిబ్బంది , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 15 నుండి 21 వరకు జోడే ఘాట్ నుండి భద్రాచలం వరకు జరుగు సిపిఐ శతజయంతి ఉత్సవాల రాష్ట్ర ప్రచార జాతాను విజయవంతం చేయండి

### సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చర్చ:- కరీంనగర్ :1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ 2025 డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో దేశవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించుకుంటుందని ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని డిసెంబర్ 15వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా జోడే ఘాట్ నుండి భద్రాచలం వరకు జరుగు రాష్ట్ర ప్రచార జాతాను విజయవంతం చేయాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి అధ్యక్షతన జరిగినది.సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటిష్ పాలకుల





నుండి విముక్తి చేయడానికి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని,సమ సమాజ నిర్మాణం కోసం,వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక,కర్షక,ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ అని, ప్రజల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం ఎంతో మంది కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన చరిత్ర సిపిఐ కి ఉందని,నాడు కాన్పూర్,మీరట్ కుట్ర కేసులు పెట్టి ఎంతోమంది సిపిఐ నాయకులను నిర్బంధించినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిన పార్టీ సిపిఐ అని, స్వాతంత్రం సిద్ధించిన తర్వాత దేశ ప్రజల సంక్షేమం కోసం,బ్యాంకుల జాతీయకరణ కోసం,భూ సంస్కరణల కోసం, భూమికోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన పార్టీ సిపిఐ అని చాడ వెంకటరెడ్డి అన్నారు. వందేళ్ళ ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం సిపిఐ నిర్వహించిన పోరాటాలను,విజయాలను, త్యాగాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 15వ తేదీ నుండి 21వ తేదీ వరకు జోడే ఘాట్ నుండి భద్రాచలం వరకు రాష్ట్ర ప్రచార జాతా నిర్వహిస్తున్నామని ఆ జాతాను విజయవంతం చేయడం కోసం ఆయా జిల్లా పార్టీ నాయకులు,కార్యకర్తలు సిద్ధం కావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశములో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,అందె స్వామి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,బత్తుల బాబు,నాగెల్లి లక్ష్మారెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్,గూడెం లక్ష్మి,పిట్టల సమ్మయ్య తదితరులు ఉన్నారు.

## అంగన్వాడీ చిన్నారులను సొంత పిల్లలుగా చూసుకోవాలి

- కేంద్రాలను మరింతగా అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి..
- విద్యార్థులను ఆకట్టుకున్న రీతిలో సెంటర్ల నిర్వహణ తీరు ఉండాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే
- రామకృష్ణ కాలనీలో అంగన్వాడీ సెంటర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల సందర్శన..



చర్చ :- కరీంనగర్ :అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులను తమ సొంత పిల్లలుగా చూసుకుంటూ అత్యుత్తమ సేవలు అందించాలని కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన లో భాగంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల బరువు, రిజిస్టర్లను పరిశీలించటంతో పాటు ప్రీ స్కూల్ పిల్లలతో సంభాషించారు ప్రీ స్కూల్ ఆక్టివిటీని పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు పనితీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో అంగన్వాడీ కేంద్రాలను తయారు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను గర్భిణీలు బాలింతలు, కిషోర్ బాలికలు చేసుకోవాలని కోరారు. విద్య రంగంలో అంగన్వాడీ కేంద్రాలే తొలిమెట్టు అని ఇవి బాగా పనిచేస్తాయని, పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. పిల్లలతో అదనపు కలెక్టర్ కాసేపు ముచ్చటించి వారికి అందిస్తున్న పౌష్టికాహారం ఆహారం వివరాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు . అంగన్వాడీ కేంద్రం ద్వారా వారికి నేర్పిస్తున్న విద్యాబోధనలు, రైమ్స్ అదనపు కలెక్టర్ ఆలకించారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థిని విద్యార్థుల సామర్థ్యాలను గమనించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను కలియ తిరిగి డ్రింకింగ్ వాటర్, కిచెన్ షెడ్, ఇతర సౌకర్యాలను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగిన సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ పనులను పకడ్బందీగా నిర్వహించాలని మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలనీ సూచించారు. తీసిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలనీ, దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలనీ, వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలనీ అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పగిలిన పైపులైన్.. నిత్యం రోడ్లపై పారుతున్న నీరు

### కాల్వల్లో పేరుకుపోతున్న మురుగు, చెత్త

### మున్సిపాలిటీకి పట్టదు.. సింగరేణికి గిట్టదు

చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కార్మిక ప్రాంతమైన రామవరం 7వ నెంబరు బజారులో అపరిశుభ్రత, పారిశుధ్యం రాజ్యమేలుతున్నాయి. వందలాది మంది కార్మికులు, రిటైర్డ్ కార్మికుల కుటుంబాలు, ఇతర ప్రజలు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంపై అటు సింగరేణి సంస్థ, ఇటు మున్సిపల్ అధికారులు చిన్నచూపు చూస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలు నిత్యం ఇబ్బందులతో సహవాసం చేస్తున్నారు. ముఖ్యంగా కిన్నెరసాని మెయిన్ పైపులైన్ పగిలిపోయిన కారణంగా ప్రతినిత్యం నీరు రోడ్లపై పారుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. రోజుల తరబడి పరిస్థితి ఇలాగే ఉండటంతో రోడ్డు కూడా కోతకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. ఇక పైపులైన్ తవ్విన రోడ్డును పూడ్చినప్పటికీ లెవెలింగ్ చేయకపోవడం వల్ల గుంతలు ఏర్పడి ఆ గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. ఆవులు, పందులు వంటి జంతువులు ఆ బురద నీటిలో పొర్లడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇదిలా ఉండగా 7వ నెంబరు



బజారులో కాల్వల్లో సిల్ట్ పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రోడ్ల పక్కన ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీని కారణంగా ఈగలు, దోమలు వ్యాప్తి చెంది స్థానికులు విష జ్వరాల భారిన పడుతున్నారు. ఈ ప్రాంతం మున్సిపాలిటీ పరిధిలో ఉండగా, కార్మిక వాడ కావంతో అటు మున్సిపల్ సిబ్బందికాని, సింగరేణి సిబ్బంది కాని పారిశుధ్య పనులను పూర్తి స్థాయిలో చేపట్టడంలేదు. అధికారులు కూడా పర్యవేక్షించకపోవడంతో



పరిస్థితులు దారుణంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక మున్సిపాలిటీకి పాలకవర్గం లేకపోవడంతో ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయంపై ప్రశ్నించలేకపోతున్నారు. ఇప్పటికైనా సింగరేణి, మున్సిపల్ అధికారులు స్పందించి ఎవరో ఒకరు బాధ్యత తీసుకుని ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి పారిశుధ్య పనులు చేపట్టాలని, మున్సిపల్ అధికారులు పగిలిన కిన్నెరసాని మెయిన్ పైపులైన్కు మరమ్మతులు నిర్వహించి గుంతలు పడిన చోట లెవెలింగ్ చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.మండలంలోని 27 కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను మండల తహసిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేద కుటుంబాలు



వివాహాలు చేసుకొని ఇబ్బందులు పడకూడదని ముందస్తు ఆలోచనతో కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాలను అందజేయడం జరుగుతుంది. నియోజకవర్గ ప్రజలు పథకాలను వినియోగించుకోవాలని కోరారు. చెక్కులు అందుకున్న కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి మరియు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల్లో ధైర్యం, భరోసా నింపేందుకే స్నేహిత

- ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు
- ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకే శుక్రవారం సభ
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





చర్చ :- కరీంనగర్ : బాలికల్లో ధైర్యం, భరోసా నింపేందుకే స్నేహిత కార్యక్రమం, మహిళలకు ఆరోగ్యం పై అవగాహన పెంచేందుకే శుక్రవారం సభకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి ప్రభుత్వ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్నేహిత-2 అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ
బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల పెట్టె తాళం చెవి నోడల్ ఆఫీసర్, షీ టీం సిబ్బంది వద్ద ఉంటుందని.. విద్యార్థినులు తమకు జరిగిన ఇబ్బందులను పేపర్ పై రాసి ఇందులో వేస్తే అధికారులే విచారించి కారకులపై చర్యలు తీసుకుంటారని వివరించారు. ఎవరైనా వేధించినా, అసభ్య కర ంగా ప్రవర్తించినా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయా న్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100కు సమాచారం ఇవ్వాలని బాలికలకు సూచించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని.. వారితో స్నేహంగా ఉంటూ అన్ని విషయాలు తెలుసుకోవాలని సూచించారు. ఏ బి సి ఆఫ్ లైఫ్ రైమ్ లో
భాగస్వాములైన ఘర్షకుర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేదికపై విలువలు తెలిపే ప్లకార్డులు ప్రదర్శించారు. లక్నోలో జాతీయస్థాయి ఉపాధ్యాయుల సదస్సులో ఈ పాటను ప్రదర్శించారు.
పరిష్కార వేదికగా శుక్రవారం సభలి వివిధ రకాల సమస్యలకు పరిష్కార వేదికగా శుక్రవారం సభ నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలకు ఆరోగ్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు, చిన్నారులకు పోషకాహారం, తదితరాంశాలు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య మహిళ కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 54 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధులు వచ్చాక ఆసుపత్రిలో చుట్టూ తిరగకుండా ముందే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం గర్భిణీలకు సీమంతం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ ధనలక్ష్మి మాట్లాడుతూ అనాథలు, బాల్యవివాహాలు, సంరక్షణ కొరవడిన పిల్లల గురించి తెలిస్తే మాకు సమాచారం ఇవ్వాలని అలాంటి వారి బాధ్యతలు మేము చూస్తామని పేర్కొన్నారు. షీ టీమ్ సీఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియాను ప్రజా ప్రయోజనానికి మాత్రమే ఉపయోగించాలని అన్నారు. అపరిచితులతో ఎలాంటి వివరాలు పంచుకోవద్దని బాలికలకు సూచించారు. సోషల్ మీడియా కీ విద్యార్థులు దూరం గా ఉండాలి అని అన్నారు జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ మహిళలు చిన్నారుల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న కార్యక్రమాలను వివరించారు.
అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విటమిన్ గార్డెన్ ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కల పెంపకం బాగుందని ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ సనా, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

- గంజాయి, మత్తు పదార్థాలు రవాణా చేస్తే సమాచారమివ్వండి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- 'చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం'లో భాగంగా భారీ బైక్ ర్యాలీ








చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే తన ధ్యేయమని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు అన్నారు. ఎస్పీ పిలుపు మేరకు ఈనెల 15వ తేదీ వరకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం%-%డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్ నుండి కొత్తగూడెం మీదుగా లక్ష్మీదేవిపల్లిలోని ఇల్లందు క్రాస్ రోడ్ వరకు భారీ బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఎస్పీ మాట్లాడుతూ చైతన్యం అనే కార్యక్రమం ద్వారా నిషేధిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన యువత పడకుండా అవగాహన కల్పించడం, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం నిరంతర తనిఖీలు చేపట్టడం వంటి కార్యక్రమాలను జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసే వారి సమాచారం అందించి భాద్యత గల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ప్రజలను కోరారు. మత్తుకు బానిసలై యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ గానీ, విక్రయిస్తూ గానీ పట్టుబడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే పీడియాక్టులను కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, కొత్తగూడెం టూ టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, పోలీస్ సిబ్బంది, సుమారు వెయ్యి మంది వాహనదారులు పాల్గొన్నారు.

# చర్ల సాయిబాబా గుడి రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం



చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :ఈరోజు చర్ల టిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో సాయిబాబా గుడి రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ చర్ల బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా గుడి మరియు కాలేజీ కి వెళ్ళే రోడ్డు గత జనవరిలో 1 కోటి 10 లక్షల రూపాయలతో రోడ్డుకి అధికారులు అనుమతించారు. 7 నెలల క్రితం బిఆర్ఎస్ పార్టీ రోడ్డు వేయించాలని ధర్నా చేయడం జరిగింది దానికి స్పందించి హడావుడిగా జూన్ 27 భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేసారు. రోడ్డు అనుమతి పోంది సంవత్సరం, శంఖుస్థాపన చేసి 6 నెలలు అయిన ఇంత వరకు దాన్ని పట్టించుకున్న నాధుడు లేడు. ఇది ప్రభుత్వ వైఫల్యమా లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా 6 గ్యారంటీలు 420 హామీలతో అనేక అబద్దాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెసు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుంది. ఇప్పుడు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలతో మోసం చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ వర్గానికి సంబంధించిన ప్రజలకు న్యాయం చేయడంలేదు వెంటనే ఈ రోడ్డు పనులు ప్రారంభంచని ఎడల నిరాహార దీక్షకు కూడ వెనుకాడమని ప్రభుత్వానికి తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, దినసరపు భాస్కర్ రెడ్డి, పంజా రాజు, కాకి అనిల్, కోంభతిని రాము, తడికల బులేబ్బాయి, తుర్రం రవికుమార్, గోరంట్ల వెంకటేశ్వరరావు, కట్టం కన్నారావు, అంబోజి సతీష్, కారం కన్నారావు, కేప గణేష్, సంత పూరి సతీష్, ఎడ్ల రామదాసు , బట్ట కొమరయ్య, గాదంశెట్టి కిషోర్, యన్నమూరి సృజన్, కుకడపు సాయి, చెన్నుమల్ల వంశి, తడికల వెంకటేశ్వర్లు, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఎక్సైజ్ అధికారి తీరుపై సిబ్బంది ఆగ్రహం

- విధులు బహిష్కరించిన సిబ్బంది



చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందిపై అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమె విధులకు వస్తే తామంతా విధులకు రామంటూ తేల్చి చెప్తున్నారు. సదరు అధికారిని వేధింపుల కారణంగా ఇటీవల మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో ఉన్నతాధికారులు సదరు అధికారిని పక్కన పెడతామని హామీ ఇవ్వడంతో సిబ్బంది విధులకు హాజరయ్యారు. ఇన్ని రోజులు కార్యాలయానికి రాని అధికారిని మంగళవారం విధులకు హాజరు కావడంతో సిబ్బంది అంత ఒకసారిగా తమ విధులను బహిష్కరించారు. మొత్తం 14 మంది సిబ్బందిలో 11 మంది విధులు బహిష్కరించారు. దీంతో కార్యాలయంలో గందరగోళం నెలకొంది. ఉన్నతాధికారి చెప్పిన విధంగా చేయలేదని తమకు మాట ఇచ్చి తప్పరంటూ ఆరోపిస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అధికారిని తరచు తమను వేధింపులకు గురి చేస్తున్నారని తమ పట్ల ఆమె ప్రవర్తిస్తున్న తీరు సరిగా లేదని సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు ఆమె వేదింపులు తాళలేక మహిళా సిబ్బంది ఆత్మహత్యయత్నానికి సైతం పాల్పడిందని తాము సజావుగా విధులు నిర్వహించలేకపోతున్నామంటూ ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ తమ గోడు పట్టించుకోకపోవడంతో సిబ్బంది మంగళవారం తమ విధులను బహిష్కరించారు. అధికారిని పంపించేంతవరకు తామెవరు విధులకు హాజరు కామంటూ నిరసన వ్యక్తం చేసారు. జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఓ అధికారిణి కింది స్థాయి సిబ్బందిని చులకనగా చూస్తూ వేధిస్తుండటంతో ఇన్ని రోజులు బయటికి రాని విషయం మహిళా సిబ్బంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బయటకు వచ్చింది సిబ్బంది అందరూ నిరసన తెలుపుతున్నారు . ఆ అధికారిని తమపై పెత్తనం చెలాయిస్తూ తాము సక్రమంగా నిర్వహిస్తున్నప్పటికీ తమను ఏదో ఒక విధంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటే తప్ప ఈ వివాదం సర్దుమనిగేలా లేదంటూ పలువురు చెప్పుకుంటున్నారు.

## ఢిల్లీ పేలుళ్లకు నిరసనగా బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన



చర్చ ,పెద్దపల్లి ప్రతినిధి:ఢిల్లీలో పేలుళ్ల కు నిరసనగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ వద్ద బిజెపి శ్రేణులు, రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించి,పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు..భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలన చూసి జీర్ణించుకోలేని పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశంలో అల్లకల్లోలం సృష్టించడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఢిల్లీ పేలుళ్లకు బాధ్యులైన ఉగ్రవాదులకు త్వరలో తగిన గుణపాఠం చెప్తామని నాయకులు హెచ్చరించారు.ం

## 16న పద్మశాలీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక



చర్చ, కొత్తగూడెం:తెలంగాణా రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆలె బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం రామాటాకీస్ సమీపంలోని కెమిస్ట్ భవనంలో ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కార్యవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్నందున నూతన కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితోపాటు మొత్తం 23 పదవులకు ఎన్నికలు జరుగు తాయన్నారు. ఈ ఎన్నికల్లో సభ్యత్వం తీసుకున్న సభ్యులందరూ పాల్గొనాలని బాలకృష్ణ కోరారు.

## పార్క్, వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6 వార్డ్ రామవరం క్లబ్ ఏరియాలోగల శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల పార్క్, వార్డులో పేరుకుపోతున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ వార్డు నాయకులు, మైనారిటీ సెల్ పట్టణాధ్యక్షులు ఎం.డి. ఖాజాబక్ష్ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, పట్టించుకునేవారు కరువయ్యారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఇళ్లల్లో చెత్తను సేకరించేందుకు రావడంలేదని అన్నారు. అదేవిధంగా పాత శ్రీ రామచంద్ర ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న పార్కుకు నిధులు మంజూరైనా పనులు మాత్రం పూర్తి చేయడంలేదని, పార్కులో పిచ్చి చెట్లు పేరుకుపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. పాములు సంచరించడం వల్ల పార్కు, ఓపెన్ జిమ్‌కు వచ్చే చిన్న పిల్లలు ఇబ్బందులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా ప్రతినిత్యం ఇదే పార్కుగుండా రాకపోకలు సాగిస్తున్నందువల్ల పాముకాటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సుజాత మున్సిపల్ అధికారులకి రెండు రోజులలో పార్కును శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండి కరీం పాషా పాల్గొన్నారు.

## సిమెంట్ బ్రిక్స్ తయారీ ప్లాంట్ ప్రారంభం



చర్చ, అశ్వారావుపేట:ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ బ్రిక్స్ కొరతను తగ్గించేందుకుగాను బెండాలపాడు గ్రామంలో బ్రిక్స్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బెండాలపాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా 312 ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేసి నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇళ్ల నిర్మాణంలో సిమెంట్ బ్రిక్స్ కొరత ఏర్పడటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాలతో బెండాలపాడు గ్రామంలో సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్ర సురేష్, బెండాలపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు కారం చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు సపావట్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ సీనియర్ నాయకులు, వీసం రాములు, కారం సైదులు, మల్లం కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు కారం వెంకటేశ్వర్లు, గుంపెన మాజీ సొసైటీ డైరెక్టర్ కారం నర్సింహారావు, గ్రామ నాయకులు బోడ శ్రీను, అజ్మీరా రమేష్, రాయల నరేష్, చల్లా కృష్ణయ్య, కారం నాగేంద్ర బాబు, కారం నవీన్, కణితి నవీన్, మిల్లర్ యాజమాని గద్దల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆరోగ్య సేవలకు ప్రాధాన్యమివ్వాలి : ఐటీడీఏ పీఓ బి.రాహుల్



చర్చ, అశ్వారావుపేట:గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని బలోపేతం చేయడం ఐటీడీఏ ప్రధాన లక్ష్యం అని ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామం జిల్లా పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో



మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ రాహుల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రతి వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సదుపాయాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుం టున్నా మన్నారు. అనంతరం శిబిరంలోని కంటి, స్త్రీల, చిన్నారుల, హృదయ, మానసిక, క్షయ వ్యాధుల విభాగాలను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ అప్పారావు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన జిఎంకు సింగరేణి బాధితుల సన్మానం



చర్చ, సత్తుపల్లి:సింగరేణి సత్తుపల్లి ఏరియాకి నూతనంగా బాధ్యతలు చేపట్టిన జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌కు సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నందు నాయక్ ఆధ్వర్యంలో బాధిత గ్రామాల సభ్యులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నందు నాయక్ మాట్లాడుతూ సింగరేణి గనుల పరిసర ప్రాంత ప్రజలు ఏళ్ల తరబడి అనేక సమస్యలతో పోరాడుతున్నారని, తమ బాధలు విన్నవించుకోవడానికి సత్తుపల్లి ప్రాంతంలో సంబంధిత అధికారుల లోపం ఉండేదని, సత్తుపల్లిని సింగరేణి ఏరియాగా ఏర్పాటు చేసి జనరల్ మేనేజర్ నియామకం చేయడం ఆనందంగా ఉందన్నారు. జిఎం ఆధ్వర్యంలో ఇబ్బందులకు గురవుతున్న గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గనుల తవ్వకాల సమయంలో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురి కావడం సహజమని, సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.డి ఇస్రార్ అహ్మద్ (సత్తుపల్లి), విప్పపువ్వు అప్పారావు(రేజర్ల), లకావత్ ప్రసాద్ (ఆర్‌టిఐ స్టేట్ అడ్వకేట్), హలావత్ అర్జున (రుద్రాక్ష పల్లి), మారోజు అశోక్ (అంబేద్కర్ నగర్), ఎస్.కె నజీమ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో విశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ



చర్చ, సత్తుపల్లి:భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పరిష్కరించుకొని సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'కృతజ్ఞత అనేది పరిపూర్ణ జీవితానికి మార్గము' అనే అంశంపై 8, 9 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో విజేతలైన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. సత్యసాయి విద్యా విభాగం ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ తనూజ విజేతలైన విశ్వశాంతి విద్యార్థులకు షీల్డ్, ప్రశంస పత్రాలు అంద౯జేశారు. 9వ తరగతిలో కౌశర్, జాస్మిన్, చాంద్ బాషా ప్రథమ, ద్వితీయ, ద్వితీయ స్థానాలు సాధించారు. 8వ తరగతిలో వైష్ణవి, ప్రియ, లోహిత మొదటి మూడు స్థానాలలో నిలిచారు. ఈ సందర్భంగా తనూజ మాట్లాడుతూ జీవించినంత కాలం సంతృప్తికరంగా ఉండటమే పరిపూర్ణ జీవనం అన్నారు. ధర్మబద్ధంగా, సంతృప్తిగా, నిజాయితీగా జీవించడం, సత్సంబంధాలు కలిగి ఉండడం, నిరంతరం నేర్చుకోవడం, నిజాయితీ, సేవ, ప్రేమ ద్వారా పరిపూర్ణ జీవితం లభిస్తుందన్నారు.

## నూతన కమిటీల నియామకాన్ని ఖండించిన మాజీ మంత్రి వనమా




చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం 2 శాఖలకు, సుజాతనగర్ మండలానికి నూతన అధ్యక్షులను నియమించడాన్ని ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వనమా వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కనీసం తనను సంప్రది ంచకుండా, నియోజకవర్గ ఇంచార్జీగా ఉన్న తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా కమిటీలు ప్రకటించడాన్ని తప్పుపట్టారు. తన రాజకీయ జీవితంలో వార్డ్ మెంబర్ నుండి మంత్రిగా పనిచేసి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి, ఎప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని గుర్తుచేశారు. పార్టీలో గ్రూపు రాజకీయలు చేసి పార్టీలో చీలిక తెచ్చే ఇటువంటి పనులు చేయలేదని, పార్టీ క్యాడర్‌ను అయోమయానికి గురి చేయలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తూ, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశానని చెప్పారు. తనను సంప్రదించకుండా జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పదవులు పంచడం సరైన సంస్కృతి కాదని, జిల్లా అధ్యక్షుడు చేసిన ఈ పని తనను తీవ్రంగా బాధించిందన్నారు. పార్టీ అధిష్టానం దృష్టి కి ఈ విషయాన్ని తీసుకువెళ్తానన్నారు.


## భరోసా సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం భరోసా సెంటర్ టీమ్ సపోర్ట్ పర్సన్ రామదేవి, ఏఎన్ఎం సాంధ్యారాణిల ఆధ్వర్యంలో మంగళవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బూర్గంపాడు మండలం సారపాక ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, భద్రాచలం శ్రీ సరస్వతి శిశు మందిర్ అవసరమ్ విద్యాలయం, రాజుపేట శ్రీ చైతన్య స్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులకు భరోసా సెంటర్ సేవలు, గుడ్ టచ్ %-% బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సోషియల్ మీడియా %-% మొబైల్ దుష్ప్రభావాలు, విద్య ప్రాముఖ్యత, టి సేఫ్ యాప్, ఫిలిస్ క్రిస్టల్ పద్ధతుల ద్వారా మానసిక ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఇన్‌చార్జిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వర్ డౌన్ నిలిచిపోయిన జన, మరణ సేవలు

- వారం రోజులుగా పనిచేయని వెబ్ సైట్
- అవస్థలు పడుతున్న అర్జీదారులు
- జనన మరణాల వెబ్ సైట్ పనిచేయక సర్వర్ డౌన్ తో నిల్చిన ధ్రువీకరణ పత్రాల సేవలు


I Will Fight I Will Win
FIGHT FOR BETTER SOCIETY
Regd. No. 6/2021
# 14-2-164, Parashuram Nagar, Godavarikhani, Dist. Peddapalli - 505 209. T.S
President: Maddela Dinesh - 9704228837
Ref No. Date: 11/11/2025
శ్రీయుత గౌరవనీయులైన
కమీషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (CDMA) హైదరాబాద్,
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గారికి!
ఆర్యా!
విషయం: జనన మరణాల వెబ్ సైట్ పనిచేయక సర్వర్ డౌన్ తో నిల్చిన ధ్రువీకరణ పత్రాల సేవలు, యుదావిధిగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.
[illegible]
దీని ప్రతులు
1. శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి జిల్లా గారికి.
2. శ్రీయుత గౌరవనీయులైన రామగుండం నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ గారికి.
ఇట్లు
మద్దెల దినేష్
email. desh1905@gmail.com




చర్చ,గోదావరిఖని:రామగుండం కార్పోరేషన్ కార్యాలయంలో జనన,మరణాల వెబ్ సైట్ గత వారం రోజులుగా సర్వర్ డౌన్ కారణంగా పనిచేయకపోవడంతో దరఖాస్తు దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి సేవలను పునరుద్ద రించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మంగళవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ , జిల్లా కలెక్టర్ ను లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.తరుచూ సర్వర్ డౌన్ కారణంగా అత్యవసర దరఖాస్తు దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

## పీకే ఓ సీ ప్రాజెక్ట్ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మిక్కినేని శ్రీ రమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం శాలువాతో ఘనంగా సత్కరించిన సామాజిక సేవకులు కర్నే బాబురావు



చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :మణుగూరు ఏరియా ప్రతిష్టాత్మక గని పీకే ఓ సీ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏజెంట్) గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మిక్కినేని శ్రీ రమేష్ ని మంగళవారం నాడు తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసిన పుష్పగుచం శాలువాతో ఘనంగా సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్న మణుగూరు ప్రాంత గ్రామనివాసి సామాజిక సేవకులు కర్నె బాబురావు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ గతంలో 2002 నుండి 2013 వరకు మణుగూరు ఏరియాలో పీకే ఓసి లో అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వహించారు. 2013 నుండి 2015 వరకు కాలరీ మేనేజర్ గా శ్రీరాంపూర్ ఆర్కే వన్ ఎ లో రెండు సంవత్సరాలు విధులు నిర్వహించారు. 2015 నుంచి బెల్లంపల్లి కైరగుడ టు నిర్వహించి 2021 ఏప్రిల్ వరకు పనిచసి పదోన్నతి పై 2021 ఏప్రిల్ కొత్తగూడెం ఏరియా వీకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ గా బదిలీ అయ్యారు. నవంబర్ పదో తారీకు 2025న మణుగూరు ఏరియా పీకే ఓ సి కి ప్రాజెక్ట్ అధికారిగా బదిలీపై వచ్చారని కర్నే బాబురావు తెలిపారు. శ్రీ రమేష్ ఆధ్వర్యంలో పీకే ఓసి కి ఉన్న పేరు ప్రఖ్యాతులు కొనసాగించే విధంగా కార్మికులతో కార్మిక సం ఘాలతో కాంటాక్ట్ కార్మికులతో, ఓబి వర్కర్లతో మంచి సంబం ధాలు కొనసాగించాలని పీకే ఓ సి కి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యా లు సాధించే విధంగా పారిశ్రామిక సంబంధాలు కొనసాగిం చాలని రక్షణతో కొన్ని ఉత్పత్తికి పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి
- సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

చర్చ, వైరా:నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, ఖమ్మం జిల్లాలో రబీ సీజన్ సన్న ధాన్యం బోనస్ పెండింగ్ డబ్బులు రూ.63 కోట్లు విడుదల చేయాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో సిపిఎం వైరా పట్టణ కమిటీ సమావేశం బొంతు సమత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్




దాలను ప్రారంభించాలని అన్నారు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు నిబంధనలు రైతులకు నష్టం చేస్తాయని, సిసిఐ విధించిన కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్, తేమశాతం 8 నుంచి 12 శాతం ఉండాలి, ఎకరాకు ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. వరి, పత్తికి తేమ శాతం 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎడతెరిపిలేని అధిక వర్షాలు మూలంగా దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు పరిహారం చెల్లించాలని, క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని సర్వే చేసి ఎకరాకు రైతులకు రూ.30 వేలు, కౌలు రైతులకు రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, కమిటీ సభ్యులు గుడిమెట్ల రజిత, హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్ రావు, కొంగర సుధాకర్, సంక్రాంతి నరసయ్య, అనుమోలు రామారావు, షేక్ నాగుల పాషా, తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## 2 టౌన్ సీఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు



చర్చ, కొత్తగూడెం : మంగళవారం రామవరం పరిధిలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ దొడ్డిగర్ల ప్రతాప్ ని మర్యాదపూర్వకంగా కలిసిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు మరియు ప్రజా ప్రతినిధులు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రగ్స్ పై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేయబడుతున్నటువంటి పోలీస్ శాఖకు అభినందనలు తెలుపుతూ టూటౌన్ సీఐ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుంపురు శివ ఎం ఎం జిల్లా అధ్యక్షులు , గడ్డం రాగన్ బాబు సింగరేణి రిటైర్డ్ హెచ్ ఓ ఎం, శనగ స్వామి ఆల్ ఇండియా రేడియో స్టేషన్ రిటైర్డ్ , సళ్ళం శంకర్ సింగరేణి రిటైర్డ్ ఫోర్మన్, మేడిపల్లి లక్మణ్ సింగరేణి రిటైర్డ్, దేవిడ్ రిటైర్డ్ సింగరేణి కార్మికుడు మరియు గడ్డం మాధవరావు సింగరేణి కాంట్రాక్టర్ తది తరులు పాల్గొన్నారు.

## బాంబు పేలుళ్ల నేపథ్యంలో అలర్ట్

- రామగుండం కమీషనరేట్ పరిధిలో బాంబు స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు








చర్చ,పెద్దపల్లి ప్రతినిధి:ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమీ షనరేట్ పరిదిలోని పెద్దపల్లి మం చిర్యాల జోన్ పోలీసులు అలర్ట్ అయ్యారు. మం గళవారం కమీషనరేట్ పరిదిలోని, గోదావరిఖని, రామగుండం, పెద్దపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రద్దీగా ఉండే ప్రాంతాలలో పోలీసులు బాంబు స్క్వాడ్, జాగిలాలతో నాకబంది నిర్వహించి వాహనాల తనిఖీలు చేపట్టారు. జనసంచారం ఎక్కువగా ఉండే ఏరియాలలో పోలీసులు అడుగడుగునా సోదాలు నిర్వహించారు.. బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ప్రధాన చౌరస్తా లతో పాటు వివిధ ప్రాంతాలలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీ లలో డీసీపీ, ఏసీపీ లు, ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు బాంబు స్క్వాడ్, జాగిలాల బృందం పాల్గొన్నారు.

## సిఐటీయూ మండల కన్వీనర్‌గా మధు



చర్చ, ములకలపల్లి:సిఐటియూ మహాసభలో మరోసారి మండల కన్వీనర్‌గా నిమ్మల మధు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సోమవారం మం డల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహాసభలో మధు ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికు లను చైతన్య పరిచి మండలంలో కార్మికుల సమస్య లపై నిరంతరం ఉద్య మాలు చేపడతా మన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమి ంచాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులుగా దుబ్బా ధనలక్ష్మి, బుగ్గా వెంకటనర్సమ్మ, ఒరుగంటి శ్రీను, చిక్కుల శ్రీను, గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మధరావు, వగ్గేల దారయ్య, కీసరి జయ, గుగలోతు శంకర్, నల్లి సుజాత, ఎస్కే మస్తాన్, సూరం పుల్లారావు, అంజమ్మ, ముదిగొండ సావిత్రి, నిమ్మల వెంకటేశ్వర్లు, ఉమా, క్రాంతి, గిరి, అంజి, వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు.

## యువ రైతులకు శిక్షణ కార్యక్రమం




చర్చ, అశ్వారావుపేట: యువ రైతులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా భద్రాచలంకు చెందిన ఇఫికార్ అనే స్వచ్ఛంద సంస్థ అశ్వారా వుపేటలోని వ్యవసాయ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమానికి 33 మంది యువ రైతులు వచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు కళాశాలలోని వివిధ రకాల పంటలను ఎలా సాగు చేయాలి అనేదానిపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో వేయదగ్గ అంతర పంటల గురించి సాంకేతికంగా తెలుసుకున్నారు. అదేవిధంగా పుట్టగొడుగుల పెంపకం, జీవ ఎరువుల తయారీ, వానపాముల తయారీ గురించి నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ హేమంత్ కుమార్ యువ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యువత యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ క్షేత్ర సందర్శనను కళాశాల ఆచార్యులు డాక్టర్ నీలిమ, డాక్టర్ బి దీపక్ రెడ్డి సమన్వ యపరిచారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ ధర్మ రాజు నిర్వహించారు. కళాశాలను సందర్శించి కొత్త పంటలను, అంతర పంటలను తెలుసుకోవడం, పుట్టగొడుగుల పెంపకం చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని అది వారికి చాలా ఉపయోగకరంగా ఉందని యువత భావించారు.

## సింగరేణి హాస్పిటల్ లో సూపర్ స్పెషాలిటీ వైద్య శిభిరం



చర్చ,గోదావరిఖని:గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 16 న హైదరాబాదు ఓమెగా హాస్పిటల్ వారి ఆద్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్న ట్లు ఆర్జీ వన్ జి.యం డి.లలిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజీ , నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల డాక్టర్లు వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. రామగుండం ఏరియా పరిదిలోని ఆర్జీ-1, ఆర్జీ-2, ఆర్జీ-3 , ఏఎల్‌పీ గనుల ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు, సిపిఆర్ఎమ్ ఎస్ ఇ,సిపిఆర్ఎంఎస్ఎన్ ఇ కార్డు కలిగిన రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల12 వ తేది నుండి ఏరియా ఆసుపత్రి వద్ద తమపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి





పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజా సేవలో, నేర నిరోధక కార్యక్రమాల్లో నిమగ్నమై అధిక పని ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, మానసిక ఆందోళన, భద్రతా ప్రమాణాలు, మానసిక ధైర్యం స్వీయ క్రమశిక్షణ, మరియు విధి నిర్వహణలో ప్రవర్తన పై వ్యక్తిగత భద్రత,స్వీయ క్రమశిక్షణ,ప్రవర్తన నియమావళి పై రామగుండం కమీషనరేట్ లో సి.పి.అంబర్ కిషోర్ ఝా ఆద్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధి నిరర్వహణలో శారీరక, మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతత, సహనం పాటించడం, సహచరుల మధ్య పరస్పర గౌరవం, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం వ్యవహారించాలని అన్నారు. పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే వ్యక్తిగత స్థాయిలో క్రమశిక్షణ, ప్రవర్తనా ప్రమాణాలు అత్యంత అవసరమని సూచించారు. ఒత్తిడి, నిరాశ, నిస్పృహలను ఎదుర్కొనే పద్ధతులు, ఆత్మహత్య ఆలోచనలు రాకుండా మానసిక ధైర్యాన్ని అలవరుచుకోవాలని సూచించారు.వ్యక్తిగత జీవనశైలి మరియు కుటుంబ సమతుల్యత వంటి అంశాలపై నిపుణులు ప్రత్యేక సలహాలు అందించారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఎంవి ఐ సంతోష్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏ ఆర్



ఏసీపీ ప్రతాప్, సైకాలజిస్ట్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, ఆర్ ఐ దామోదర్, శ్రీనివాస్, సిసి హరీష్, ఆర్ ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానికులపైకి దూసుకెళ్లిన లారీ స్పాట్‌లోనే



**నెల్లూరు, నవంబర్ 11:** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. (మంగళవారం) నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై చేపల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన లారీ స్థానికులపై దూసుకెళ్లింది. అలాగే టాటా ఏస్ వాహనం, మూడు బైకులు ఢీ కొట్టిన లారీ ఆపై చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కాగా... ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనాలు చాలా నెమ్మదిగా నడపాల్సి ఉంటుంది. అక్కడ కొన్ని ఇండికేషన్స్ కూడా ఉంటాయి. అయితే ఇవేమీ పాటించుకోకుండా చెన్నై నుంచి కలకత్తా వైపు వెళ్తున్న ఓ లారీ అతి వేగంగా దూసుకొచ్చింది. రోడ్డు పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారి పైకి వెళ్లింది. ఎప్పుడూ చాలా రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో పాటు పలువురు గాయపడటం పలువురిని తీవ్రంగా కలిచివేసింది. ప్రస్తుతం క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స జరుగుతోంది. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర రోడ్డు ప్రమాదం జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## జగన్ హయాంలో విధ్వంస విధానాలతో పరిశ్రమలు వెనక్కి వెళ్లాయి

**ప్రకాశం, నవంబరు11 :** క్వాంటం కంప్యూటర్స్‌ని అమరావతికి తీసుకువచ్చామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడువ్యాఖ్యానించారు. క్వాంటం కంప్యూటర్స్ జనవరి లో ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ని బిల్డ్ చేస్తామని పేర్కొన్నారు. ఇష్టపడి స్మార్ట్‌గా పనిచేస్తే ఏదైనా సాధ్యమవుతు ందని చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో యువత భాగస్వాములు అవుతారని స్పష్టం చేశారు. (మంగళవారం) ప్రకాశం జిల్లాలోని లింగన్నపాలెంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. జగన్ హయాంలో విధ్వంస విధానాలతో పరిశ్రమలు వెనక్కి వెళ్లాయని ఆరోపించారు. వైసీపీ హయాంలో ప్రజా వేదిక కూల్చడంతో ప్రారంభమైన విధ్వంసం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిందని ఆక్షేపించారు.కనిగిరి కనకపట్నం అవుతుందని బ్రహ్మంగారు చెప్పారని గుర్తుచేశారు. కనిగిరి కనకపట్నం కావడానికి ఎంతోకాలం పట్టదని తెలిపారు. మెంథా తుఫానులో సమర్థవంతంగా పనిచేశామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమష్టిగా పనిచేశారని ప్రశంసించారు. మెంథా తుఫాను నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టామని నొక్కిచెప్పారు. చదువుకుంటున్న విద్యార్థు



లకు చదువులు పూర్తయ్యేలోపు స్థానికంగా ఉపాధి కల్పించే బాధ్యత తనదని ఉద్ఘాటించారు. 1987 ప్రాంతాల్లో అందరికీ ఉద్యోగాలు ఇస్తామని కొంతమంది రాజకీయ నేతలు చెప్పేవారని...కానీ తాను మాత్రం ఇంటికొక వ్యాపారవేత్తని తయారు చేస్తానని హామీ ఇచ్చి అమలు చేశానని తెలిపారు. తాను చేసిన పనులే సాక్ష్యాలుగా ఉన్నాయని స్పష్టం చేశారు. 25 ఏళ్ల క్రితం తాను అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తే హైదరాబాద్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని నొక్కిచెప్పారు. 17 నెలల నుంచి భిన్నమైన పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏపీలో పని చేస్తోందని వెల్లడించారు. చాలా సుడిగుండాల నడుమ తాము పని చేస్తున్నామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని భరోసా కల్పిం చారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ ఉండాలనేది తన లక్ష్యమని ఉద్ఘాటించారు.వ్యవస్థాపకుల రుణాలకు ప్రభుత్వా లు గ్యారెంటీ ఇస్తున్నాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 95 శాతానికి గ్యారెంటీ ఇస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఏపీ అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని అన్నారు. ఒకప్పుడు ఏపీ అంటే పలువురు ఇష్టపడేవారు కాదని. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే భలేభలే అంటు న్నారని చెప్పుకొ చ్చారు.కేంద్ర ప్రభుత్వం తెచ్చే పాలసీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. జపాన్, అమెరికా సరసన ఏపీ చేరబోతుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తనను ఎవరూ మోసం చేయలేరని అన్నారు. వారసత్వంగా వచ్చిన సమ స్య రెవెన్యూని వెంటాడుతోందని తెలిపారు. ఈ సమస్యపైనే తాను శ్రద్ధ పెట్టానని. అవసరమైతే కొరడా తీసుకుంటానని హెచ్చరించారు. పెట్టుబడులు తెచ్చి 20 లక్షల మందికి ఉద్యోగా లు ఇస్తామని అన్నారు. ఏపీ వ్యాప్తంగా ఈవారం పెట్టుబ డులు రానున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## త్వరలోనే ఏపీకి మరిన్ని పరిశ్రమలు

**అనంతపురం, నవంబర్ 11:** యువత భవిత కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సిరికల్చర్ కార్యాలయ ప్రాంగణంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పయ్యావుల మాట్లాడుతూ.. ఈనెల 13, 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే వ్యాపార భాగస్వామ్య సదస్సుకు 51 దేశాల నుంచి వస్తున్నారని.. ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను అధిగమించి చంద్రబాబు నాయుడు బ్రాండ్ చూసి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. గూగుల్ సంస్థ అమెరికా తర్వాత ఏపీలో అతిపెద్ద పెట్టుబడి పెట్టిందని చెప్పుకొచ్చారు. కేవలం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇక్కడికి వచ్చినట్లు మంత్రి తెలిపారు.గతంలో మైక్రోసాఫ్ట్ తెస్తే యువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు వచ్చాయని గుర్తుచేశారు. తాజాగా ఏఐ వచ్చాక గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. గూగుల్‌తో పాటు ఏఐని వాడుకునే ఇతర పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు. ఇది మూడుతరాల వారిని అదుకుంటుందని తెలిపారు. జగన్ చెప్పినట్లు నాలుగు రేకులు వేసే షెడ్ కాదని వ్యాఖ్యలు చేశారు. విశాఖ ప్రపంచంలోనే పెద్ద డేటా సెంటర్ కాబోతోం దన్నారు.భవిష్యత్‌తరాలు ఎలా బాగుపడతాయని జగన్ ఆలోచిస్తే బాగుంటుందని హితవుపలికారు. హంద్రీనీవాలో అన్ని పంపులు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. వీలైనన్ని ఎక్కువ నీరు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. రైతులు బాగుంటే.. పరిశ్రమలు వస్తే... రాష్ట్ర ఎకానమీ బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామ న్నారు. విశాఖలో అద్భుతాలు జరగబోతున్నాయన్నారు. గతంలో కార్పోరేట్ సంస్థలు ఇక్కడికి వచ్చేందుకు భయపడ్డాయన్నారు. కానీ నేడు పెట్టుబడులు పెట్టండి... ఉద్యోగాలు ఇవ్వండని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అడుగుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.



## అన్ని జిల్లాల సమాన అభివృద్ధికి కృషి

**కాకినాడ, నవంబర్ 11:** జిల్లాలో మంత్రి నారాయణ పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలు పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. కాకినాడ పోర్టులో ఎమ్ఏటీ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ,పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, తునిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంత రం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని. ఇక్కడ ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపో యారని అన్నారు.పెట్టుబడిదారులు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సరిగా ఉందో లేదో ముందుగా చూసుకుంటా రని తెలిపారు. గత ఐదేళ్లలో ఏపీలో అరాచక పాలన ఉందని విదేశీ పెట్టుబ డిదారులు చెప్పారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ముందుకెళ్తున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కూడా పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లి వచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల కోట్ల



పెట్టుబడుల ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేలా పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు జరుగను న్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో సీఎం ముందుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాల సీలు తీసుకొచ్చి సబ్సిడీలు కూడా ఇస్తున్నామన్నారు. కాకినాడ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని.. కాకినాడ పోర్టు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైంది

**అమరావతి, నవంబరు11:** సనాతర ధర్మ పరిరక్షణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సనాతర ధర్మ పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక బోర్డు అవసరమని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు డిప్యూటీ సీఎం. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజానికి, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర కేంద్రం కంటే ఎక్కువ అని అభివర్ణించారు.తిరుపతి లడ్డూ కేవలం తీపి కాదని.. ఇది ఒక ఉమ్మడి భావోద్వేగమని ఉద్ఘాటించారు. తిరుపతి లడ్డూని అప్యాయంగా స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. తిరుపతి లడ్డూని ఇలా అందజేయడం వల్ల హిందువుల సమష్టి విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని ఉద్ఘాటించారు. ప్రతి సంవత్సరం దాదాపు 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని నొక్కిచెప్పారు.సనాతన భావాలు, ఆచారాలు ఎగతాళి చేస్తే తనకు ఎంతో ఆవేదన



కలిగిందని పేర్కొన్నారు. లౌకికతత్వం రెండు వైపులా ఉండాలని సూచించారు. హిందువుల విశ్వాసంపై రక్షణ, గౌరవంపై చర్చించాల్సిన అవసరం ఉందని తెలిపారు.జనసేన నేత కిరణ్ రాయల్. అయితే, కిరణ్ రాయల్ శ్రీవారి లడ్డూని ధర్మారెడ్డికి ఇచ్చే ప్రయత్నం చేయగా లడ్డూ తీసుకోకుండా అక్కడ నుంచి ఆయన వెళ్లినట్లు సమాచారం.సుబ్బా రెడ్డికి సీబీఐ అధికారుల నోటీసులుమరోవైపు.. కల్తీ నెయ్యి కేసులో విచారణకు హాజరు కావాలని టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బా రెడ్డికి సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 13వ తేదీన లేకపోతే 15వ తేదీన హాజరవుతానని సమాధానం ఇచ్చారు సుబ్బారెడ్డి. సనాతన ధర్మం అత్యంత పురాతనమైనదని ఉద్ఘాటించారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికతలలో సనాతన ధర్మం ఒకటని అభివర్ణించారు. హిందువుల కోసం సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సిట్ దూకుడు




**తిరుపతి, నవంబరు11:** తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారణకు (మంగళవారం) పిలిచింది. సిట్ విచార ణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని గంటలుగా ధర్మారెడ్డిని సీబీఐ డీఐజీ విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈరోజు సాయంత్రం వరకు ధర్మారెడ్డిని విచారించనున్నారు సిట్ అధికారులు.(బుధవారం) కూడా ధర్మారెడ్డిని విచారించే అవకాశాలు ఉన్నాయి. అయితే, సిట్ విచారణ నుంచి బయటకు వెళ్లారు ధర్మారెడ్డి. ఈ నేపథ్యంలోనే మీడియాతో మాట్లాడటానికి ఆయన వచ్చారు. ఆ సమయంలో ధర్మారెడ్డికి శ్రీవారి లడ్డూ ఇచ్చేందుకు ప్రయత్నించారు జనసేన నేత కిరణ్ రాయల్. అయితే, కిరణ్ రాయల్ శ్రీవారి లడ్డూని ధర్మారెడ్డికి ఇచ్చే ప్రయత్నం చేయగా లడ్డూ తీసుకోకుండా అక్కడ నుంచి ఆయన వెళ్లినట్లు సమాచారం.సుబ్బా రెడ్డికి సీబీఐ అధికారుల నోటీసులుమరోవైపు.. కల్తీ నెయ్యి కేసులో విచారణకు హాజరు కావాలని టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బా రెడ్డికి సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 13వ తేదీన లేకపోతే 15వ తేదీన హాజరవుతానని సమాధానం ఇచ్చారు సుబ్బారెడ్డి. తాను లక్నోకు వెళ్తున్నందున 15వ తేదీన విచారణకు హాజరవుతానని సుబ్బారెడ్డి సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

## గుంటూరు జిల్లాలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ పర్యటన

**గుంటూరు జిల్లా, నవంబరు11 :** గుంటూరు జిల్లాలోని వెంగళాయపాలెంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం పర్యటించారు. నల్లపాడు లయోలా స్కూల్లో పైలాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహ్మద్ నజీర్, గల్లా మాధవి , మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద వెంగళాయపాలెం చెరువు వద్ద రూ.1.20కోట్లతో చేసిన అభివృద్ధి పనులని పరిశీలించారు శివరాజ్ సింగ్ చౌహాన్.ఈ సందర్భంగా పైలన్‌ని ఆవిష్కరించిన అనంతరం మొక్కలు నాటారు కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్. వెంగళాయపాలెం చెరువును శివరాజ్ సింగ్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ



సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పురాతన వెంగళాయపాలెం చెరువుని అత్యాధు నికంగా పునరుద్ధరించారని వ్యాఖ్యానించారు శివరాజ్ సింగ్ చౌహాన్.వెంగళా యపాలెం చెరువు ద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగా యని వివరించారు. వెంగళాయపాలెం చెరువు ద్వారా పశువులకు తాగ ునీరు లభిస్తుందని వెల్లడించారు. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి ఈ చెరువుని ఉపయోగిం చవచ్చని వివరించారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్ వంటివి ప్రజలకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పంచుతాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

## పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి :** తిరుచానూరు పద్మావతీ అమ్మవారి వార్షిక కార్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6.00 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు.ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.పరదాలు బహుకరణ.. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ప్రతినిధులు అమ్మవారి ఆలయంలో మంగళవారం 7 పరదాలను, తిరుపతికి చెందిన మణి 3 పరదాలను డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబు స్వామికి దాతలు అందజేశారు. అమ్మవారి గర్భాలయంలో పరదాలను అలంకరించనున్నారు.



## అదే లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ ముందడుగు

**తిరుపతి, నవంబర్ 11:** నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేయిస్తు న్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ. అంతర్జాతీయంగా సీబీఎన్ అంటే ఒక బ్రాండ్ అని. ఆయన సీఎంగా ఉన్నారంటే పారిశ్రామికవేత్తలకు ఒక నమ్మకం, గౌరవమని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో 9.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ పని చేస్తున్నారని వెల్లడించారు.గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉంటే నేడు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పెట్టుబడిదారులను ఆకట్టుకుంటున్నామని తెలిపారు. ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ ఎంఈ పాలసీ, ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీలతో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ, క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపై దృష్టిసారించిందని



చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో విశాఖపట్నం, తిరుపతి, అమరావతి లను మెగా సిటీలుగా అభివృద్ధి చేయడంతో పాటు, ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూ లంగా ఉండేలా చేయనుం దన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు, ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. పారిశ్రామికవే త్తలను, పరిశ్రమలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రమ్మంటుంటే, రాష్ట్రంలో మళ్ళీ జగన్ రాడు అనే గ్యారంటీ ఇవ్వమం టున్నారని మంత్రి తెలిపారు. అమర్ రాజా బ్యాటరీస్, కియా అనుబంధ సంస్థలు, జాకీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లులూ, బిఆర్‌షెట్టి గ్రూప్, ట్రైటాన్ ఎలక్ట్రానిక్స్, వంటి పరిశ్రమలతో పాటు ఫార్చ్యూన్ వంటి 500 కంపెనీలను కూడా జగన్ బలవంతంగా పక్క రాష్ట్రాలకు తరిమేశారని మ ండిపడ్డారు. మరలా జగన్ వస్తే రప్పా,రప్పా నరుకుతామని.. టెండర్లు రద్దు చేస్తామని.. విధ్వ ంసం చేస్తామంటూ పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారని మం త్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిహార్ అంతర్జాతీయ సరిహద్దు 72 గంటలపాటు సీల్ దిల్లీ పేలుడు వేళ భద్రత కట్టుదిట్టం




**బిహార్:** బిహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు సంభవించిన నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని సరిహద్దును 72 గంటలపాటు సీల్ చేసినట్లు డీజీపీ వినయ్ కుమార్ తెలిపారు. "సోమవారం దిల్లీలో భారీ పేలుడు జరిగిన నేపథ్యంలో, బిహార్?లో అలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. ఎన్నికల దృష్ట్యా బిహార్‌ను ఆనుకుని ఉన్న అంతర్జాతీయ సరిహద్దును గత 72 గంటలుగా సీల్ చేశాం" అని బిహార్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వినయ్ కుమార్ మంగళవారం తెలిపారు.బిహార్, నేపాల్ మధ్య దాదాపు 700 కి.మీ పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ఉంది. బిహార్‌ని పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, మధుబని, సుపాల్ అరారియా, కిషన్‌గంజ్, సీతామర్హి అనే 7 జిల్లాలు నేపాల్?తో సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దుల గుండా ఎలాంటి ఉగ్రశక్తులు దేశంలోకి చొరబడకుండా బిహార్? పోలీసులు సీల్ చేశారు. అయితే నేపాల్‌తో బిహార్ స హా ఉత్తరప్రదేశ్ ఉత్తరాఖండ్‌లు కూడా సరిహద్దును పంచుకుంటున్నాయి. అంటే ఈ మూడు రాష్ట్రాలు కలుపుకుంటే, భారత్, నేపాల్ మధ్య ఏకంగా 1,300 కి.మీ సరిహద్దు ఉంటుంది. ఈ సరిహద్దును 'సశస్త్ర సీమా బల్' (ఎస్ఎస్‌బీ) పర్యవేక్షిస్తుంది.ప్రశాంతంగా ఎన్నికలు బిహార్‌లో ప్రస్తుతం రెండో దశ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. అయితే దిల్లీ పేలుడు నేపథ్యంలో ఎస్ఎస్‌బీ, బిహార్ రాష్ట్ర పోలీసులు దళాలు అంతరాష్ట్ర సరిహద్దుల వెంట సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తున్నాయని డీజీపీ తెలిపారు.బిహార్‌లో నవంబర్ 6న రికార్డ్ స్థాయిలో ఓటింగ్ నమోదు అయ్యింది. రెండో దశ ఎన్నికలు ఈరోజు జరుగుతున్నాయి. ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెలువడనున్నాయి.అమిత్ షా భద్రతా సమీక్షమరోవైపు కేంద్ర మంత్రి అమిత్ షా దిల్లీ పేలుడుపై మంగళవారం తన నివాసంలో ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ డేట్, దిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వర్చువల్‌గా ఈ సమావేశంలో మాట్లాడారు. మంగళవారం ఎఫ్ఎస్ఎల్, ఎన్ఐఏ బృందాలు మరోసారి దిల్లీ పేలుడు ప్రదేశానికి చేరుకున్నాయి. అదనపు ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించాయి. అయితే దిల్లీ పేలుడు, ఫరీదాబాద్‌లో భారీగా బాంబు తయారీ సామగ్రి లభ్యం కావడం వెనుక పెద్ద ఉగ్రవాద నెట్?వర్క్ పనిచేస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో 9 మంది మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు చనిపోయారు. దీనితో మృతుల సంఖ్య 12కు పెరిగింది. ఇంకా చాలా మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.మరోవైపు, దిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. నిందితులను ఎట్టిపరిస్థితుల్లో కూడా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. భూటాన్ పర్యటనకు వెళ్లి ప్రధాని మోదీ, ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

# దిల్లీ పేలుడు ఘటనలో 12కి చేరిన మృతుల సంఖ్య



**దిల్లీ:** దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు ఈ దుర్ఘటన వల్ల మరణించినవారి సంఖ్య 12కు చేరుకుంది. మరోవైపు, ఈ భారీ పేలుడుపై చర్చించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగింది. అలాగే పేలుడు వల్ల మరణించినవారికి సుప్రీంకోర్టు నివాళులర్పించింది.పెరిగిన మృతుల సంఖ్యదిల్లీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 12కి చేరింది. సోమవారం జరిగిన ఈ పేలుడులో 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో మరో ముగ్గురు చనిపోయారు. దీంతో ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 12కి చేరుకుందని దిల్లీ పోలీసులు తెలిపారు. మరికొందరు క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. అమిత్ షా హై-లెవెల్ మీటింగ్భారీ పేలుడుతో దేశ రాజధాని దిల్లీ ఉక్కిరిబిక్కిరైన వేళ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి భద్రతా సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం కర్తవ్యభవన్‌లో జరిగిన ఈ భేటీకి హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, దిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ హాజరయ్యారు. జమ్ముకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వర్చువల్ గా పాల్గొన్నారు. దిల్లీ పేలుడు, ఉగ్ర కుట్రలు, కశ్మీర్ ఘటనలపై చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దిల్లీ సహా దేశంలోని ఇతర ప్రాంతాలలో భద్రతా పరిస్థితిని సమీక్షించారని పేర్కొన్నాయి.నివాళులర్పించిన సుప్రీంకోర్టుదిల్లీ పేలుడు ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో పేలుడు బాధితులకు నివాళులర్పించింది. సుప్రీంకోర్టు చట్ట నియమాలను కాపాడటానికి కట్టుబడి ఉందని పేర్కొంది. "ఈ కష్ట కాలంలో దేశ పౌరులకు సుప్రీంకోర్టు అండగా ఉంటుంది. చట్ట నియమాలను కాపాడటానికి దేశ అత్యున్నత న్యాయస్థానం కట్టుబడి ఉంది. పేలుడు వల్ల మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలి" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు.ఎర్రకోట మెట్రో స్టేషన్ మూసివేత! మరోవైపు, దిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రతా కారణాలు రీత్యా ఎర్రకోట మెట్రోస్టేషన్‌ను మూసివేసినట్లు ప్రకటించారు. అలాగే ఎర్రకోట మెట్రోస్టేషన్ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలను కూడా విధించామని తెలిపారు. "సర్వీస్ అప్డేట్. భద్రతా కారణాల దృష్ట్యా లాల్ ఖిలా మెట్రో స్టేషన్ (ఎర్రకోట మెట్రోస్టేషన్)ను మూసివేశాం. మిగతా అన్ని మెట్రో స్టేషన్లు యథావిధిగా పనిచేస్తున్నాయి" అని దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎక్స్ పోస్ట్?లో పేర్కొంది.

# ఢిల్లీ పేలుళ్ల ఘటన కీలక వ్యక్తి ఫొటో వెలుగులోకి



**ఢిల్లీ:** పేలుళ్ల కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డా.ఉమర్ మహమ్మద్‌ముఖచిత్రం బయటపడింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో పేలిన వైట్ హ్యుండాయ్ ఐ20కారు ఉమర్‌కు చెందినదిగా పోలీసులు తేల్చారు. ఈ దుర్ఘటనలో 9 మంది మరణించగా, 20 మంది క్షతగాత్రులయ్యారు. దీనిని ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న పోలీసులు. అతడి ముఖాన్ని యాక్సెస్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జమ్ము కశ్మీర్ అతడి తల్లి, సోదరులను దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది.ఉమర్ 1989 ఫిబ్రవరి 24న జమ్ము కశ్మీర్‌లోని పుల్వామాలో జన్మించాడు. ఇతడు ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ మెడికల్ కాలేజీలో వైద్యునిగా పనిచేస్తున్నాడు. జమ్ము కశ్మీర్, హరియాణా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో సోమవారం అరెస్టైన ఇద్దరు వైద్యులు అదిల్ అహ్మద్ రాథర్, ముజామ్మిల్ షకీల్‌లతో ఇతడికి సాన్నిహిత్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్ని రోజులుగా మాడ్యూల్‌లో ఉన్న ఆ ఇద్దరు కీలక సభ్యులను అరెస్ట్ చేసిన దర్యాప్తు బృందం. వారి నుంచి సుమారు 2,900 కిలోల అనుమానిత పేలుడు పదార్ధాలను స్వాధీనం చేసుకుంది. విషయం తెలుసుకున్న ఉమర్.. ఫరీదాబాద్ నుంచి పరారయ్యాడు. అతడు భయాలోందనకు గురై ఇలా ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడినట్టు సమాచారం. ఈ దాడి చేసేందుకు ఉమర్, అతడి సన్నిహితులు అమ్మోనియం నైట్రేట్ ఇంధన ఆయిలను వినియోగించారు. కారులో డిటోనేటర్‌ను ఉంచి లాల్‌ఖిలా సమీపంలో రద్దీగా ఉండే ప్రదేశంలో ఈ ఉగ్రదాడికి పాల్పడ్డారు.పేలుళ్లను అమలు చేశారిలా.ఎర్రకోట సమీపంలో పేలిన హ్యుండాయ్ ఐ20 వాహనం.. బాదర్‌పూం సరిహద్దు నుంజి ఢిల్లీలోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలలో నిక్షిప్తమయ్యాయి.7674 నంబర్ ప్లేట్ కలిగిన ఆ కారును.. ఔటర్‌రింగ్ రోడ్ నుంచి మధ్యాహ్నం గం.3:19ల ప్రాంతంలో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పార్క్ చేశారు. ఆ తర్వాత మూడు గంటల అనంతరం సాయంత్రం గం.6:30లకు అక్కడి నుంచి బయల్దేరిందని అధికార వర్గాలు తెలిపాయి. అనుమానిత ఆత్మాహుతి దళ సభ్యుడు ఒక్క నిమిషం కూడా ఆ కారును వదిలివెళ్లలేదని పేర్కొన్నాయి.చేతులు మారిన కారు.దాడిలో ఉపయోగించిన కారు అనేకసార్లు చేతులు మారిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తొలుత ఆ కారును గురుగ్రామ్‌కు చెందిన సల్మాన్ అనే వ్యక్తి 2025 మార్చిలో ఓఖ్లాలోని దేవేందర్‌కు అమ్మాడు. ఆ తర్వాత దేవేందర్ దానిని అంబాలా వాసికి విక్రయిం చాడు. ఆ వ్యక్తి నుంచి అమీర్‌కు, ఆపై తారిఖ్, ఉమర్‌లకు చేతులు మారి పుల్వామాకు చేరింది. అక్కడ అమీర్, తారిఖ్, రశీద్‌ల మధ్య సంబంధాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో అమీర్, తారిఖ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు ఢిల్లీ పోలీసులు.వైద్యులుగా పనిచేస్తూ.ఫరీదాబాద్ నుంచి ఇటీవల అనేక మంది వైద్యులు అరెస్ట్ కాగా.. వారు ఉగ్రవాద దాడికి ప్లాన్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీరిలో అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ) వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ ఒకడు. అతడు. శ్రీనగర్‌లోని జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రసంస్థకు మద్దతుగా పోస్టర్లు వేస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా తెలుసుకున్న పోలీసులు.. ఈనెల 6న ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఓ ఆసుపత్రిలో అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేయగా.. ముజామ్మిల్ షకీల్ అనే మరో వైద్యుడికి ఇందులో సంబంధమున్నట్టు తేలింది. అతణ్ని ఈనెల 10న అరెస్ట్ చేశారు. షకీల్‌ను అరెస్ట్ చేసిన మాడ్యూల్లోనే ఓ మహిళా వైద్యురాలు షహీన్ షాదిద్‌ను అదుపులోకి తీస్కున్నారు. ఆ సమయంలో ఆమె కారులోంచి ఒక ఏకే-47 రైఫిల్, లైవ్ కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేస్కున్నారు.

# బిహార్‌లో ముగిసిన రెండో విడత పోలింగ్



**బిహార్ :** చెదురుమదురు ఘటనలు మినహా బిహార్ లో రెండో విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ సాగింది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ అధికారికంగా ముగిసినా, లైనలో ఉన్నవారికి అధికారులు ఓటువేసే అవకాశాన్ని కల్పించారు. రెండో విడతలో 20 జిల్లాల పరిధిలోని 122 నియోజకవర్గాల్లో 12 మంది మంత్రులు సహా 1302 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకున్నారు. దిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. 4 లక్షలకు పైగా భద్రతా బలగాలను మోహరించారు. భద్రతా కారణాల దృష్ట్యా బిహార్ వెంట ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల మూసివేత వంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రులుబిహార్‌లో 243స్థానాలు ఉండగా ఈనెల 6వ తేదీన 121స్థానాలకు తొలివిడతలో పోలింగ్ జరిగింది. బిహార్ ఎన్నికల చరిత్రలోనే అత్యధికంగా 65.08శాతం ఓటింగ్ నమోదైంది. మంగళవారం ఇవాళ జరిగిన పోలింగ్‌లో వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు ఓటువేశారు. పశ్చిమ చంపారన్ నర్కటియాగంజ్ లో కేంద్రమంత్రి సతీశ్ చంద్ర దూబే ఓటు వేశారు. బిహార్ మంత్రి నితిశ్ మిశ్రా, బిహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్ జైస్వాల్, జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అరారియా జిల్లాలోని ఓ పోలింగ్ బూత్ దగ్గర బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓటర్లపై దాడి చేసేందుకు బీజేపీ యత్నించిందని కాంగ్రెస్ ఆరోపించింది.ఆర్‌జేడీ నిబంధనలను ఉల్లఘించింది: బీజేపీబిహార్ ఎన్నికల రెండో దశ జరుగుతున్న సమయంలో ఆర్?జేడీ సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందని బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. అలాంటి చర్యలు ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీస్తాయని ప్రధాన ఎన్నికల అధికారికి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదులో బీజేపీ పేర్కొంది. బీజేపీ, ఎల్‌జేపీ కార్యకర్తలు కలిసి జేడీయూకు ఓటువేసేందుకు వెళుతున్నవారిని అడ్డుకున్నారని ఆర్జేడీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేసింది. ఆ పోస్టును తప్పుబట్టిన బీజేపీ ఎన్డీఏలో విభజన సృష్టించి ఓటర్లను ప్రలోభపెట్టాలని ఆర్జేడీ యత్నిస్తోందని మండిపడింది.ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో దశ అసెంబ్లీ ఎన్నికల్లో 67.14శాతం పోలింగ్? నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా కిషన్?గంజ్? జిల్లాలో 76.26 శాతం పోలింగ్? నమోదైనట్లు తెలిపారు. అదేవిధంగా కతిహార్‌లో 75.23 శాతం, పూర్ణియాలో 73.79 శాతం, సుపాల్‌లో 70.69 శాతం, పూర్వి చంపారన్‌లో 69.02 శాతం, బంకాలో 68.91 శాతం, నవాడాలో సాయంత్రం 5 గంటల వరకు 57.11 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ కేబినెట్‌లోని 12 మంది మంత్రుల భవితవ్యాన్ని రెండో దశ నిర్ణయించనుంది. ఇదిలా ఉండగా బిహార్ తొలి దశ ఎన్నికల్లో రాష్ట్ర చరిత్రలో అత్యధిక పోలింగ్ 65.08శాతం నమోదైంది.

# తుంగభద్రలో నీరున్నా కాలువలకు వదలడం సాధ్యం కాదు



**బళ్లారి(బెంగళూరు):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా వంద పార్టీ కార్యాలయాలు నిర్మించాలని తలపెట్టిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని జలవనరుల శాఖా మంత్రి, డీసీఎం డీకే శివకుమార్‌న్నారు. కూడ్లిగిలో చెరువులకు నీరు వదిలే కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో నీరున్నా కాలవలకు వదలడం సాధ్యం కాదని, రైతులు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. తుంగభద్రకు నీరు వదిలితే క్రస్ట్‌గేట్లు అమర్చడం సాధ్యం కాదన్నారు.రైతులు సహకరించకపోతే నీటి ప్రాజెక్టుకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్లు అమర్చే విషయంలో సీడబ్ల్యూసీ, రెండు రాష్ట్రాల అధికారులు బోర్డు కమిటీ సమావేశం అయి నిర్ణయం తీసుకుంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 100 కార్యాలయాలు నిర్మాణం చేపట్టిందన్నారు. ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యేలు పార్టీ కార్యాలయం కోసం స్థలాలు ఇచ్చారని, కొందరుఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు.

# దొంగ ఓట్లు కుదరవనే 'సర్'కు వ్యతిరేకం



**చెన్నై:** రాష్ట్రంలో 21 ఏళ్ల అనంతరం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) వల్ల దొంగ ఓట్లు వేసేందుకు అవకాశం ఉండదన్న భయంతోనే డీఎంకే వ్యతిరేకిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. కోయంబత్తూర్ విమానాశ్రయంలో మంగళవారం ఉదయం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం, అర్హత కలిగిన వారు మాత్రమే ఓటరు జాబితాలో ఉండాలన్న దృష్టితో కేంద్ర ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియను రాష్ట్రంలో ప్రారంభించిందన్నారు.గతంలో 8 సార్లు ఓటరు జాబితాను సవరించారని, అయితే ఆ జాబితాల్లో మరణించినవారు, వలస వెళ్లి వారి పేర్లు కూ డా ఉండడంతో, వాటిని తొలగించడమే 'సర్' ఉద్దేశమని, ఈ ప్రక్రియను వ్యతిరేకించడం సరికాదన్నారు. డీఎంకే, మిత్రపక్షాలు 'సర్' మాట వింటేనే ఉలిక్కిపడుతున్నాయని, ఈ ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో పూర్తిచేసేందుకు బీఎల్వోలున్నారని తెలిపారు. నగరంలో దొంగఓటు వేసేందుకు యత్నించిన డీఎంకే నిర్వాహకులను మాజీ మంత్రి డి.జయకుమార్ పట్టించారని, ఓటరు జాబితా సవరణల్లో తప్పులుంటే వాటిని సరిచేసుకోవాలే కానీ, వ్యతిరేకించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

# మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజు ల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది.కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను ఇవాళ మూసివేశారు.

# భారత్‌పై సుంకాలను తగ్గిస్తున్నట్టు అమెరికా ప్రకటన



**అమెరికా :** సుంకాల పేరిట భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్న అమెరికా తాజాగా శుభవార్త అందించింది. భారత్‌పై సుంకాలనుసగానికి అనగా 50 శాతం తగ్గిస్తున్ననట్టు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోళ్లే ఈ సుంకాలు రెట్టింపు కావడానికి ప్రధాన కారణమని ట్రంప్ స్పష్టం చేశారు.'రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా భారత్‌పై అధిక సుంకాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు భారత్ ఆ కొనుగోళ్లను తగ్గించింది. ఫలితంగా.. మేము ఆ సుంకాలను సగానికి తగ్గిస్తున్నాం.' అని ట్రంప్ అన్నారు. అంతకముందు భారత్‌తో వాణిజ్య సంబంధాలలో తగ్గుదల గురించి ట్రంప్ సూచనప్రాయంగా మాట్లాడుతూ.. తాము ఇండియాతో వాణిజ్య ఒప్పందానికి అతి దగ్గరగా ఉన్నామని, భారతీయ వస్తువులపై విధించిన అధిక సుంకాలను త్వరలో తగ్గించే అవకాశమున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్.. ప్రధాని మోదీని కూడా ప్రశంసించారు.భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తుందన్న కారణంతో.. తొలుత 25 శాతం సుంకాన్ని విధించారు ట్రంప్. ఆ తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలను కొనుగోలు చేయడం ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్.. రష్యాకు ఆర్థికంగా మద్దతిస్తోందని ట్రంప్ ఆరోపించిన విషయం తెలిసిందే.


# దేశ ప్రజలారా పారాహుషార్ !



ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు మరోమారు భారత్‌కు సవాల్ విసిరారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న గంటల్లోనే ఎర్రకోట వద్ద మారణహోమం సృష్టించారు. ఈ ఘటన జాతి యావత్తునూ ఉలిక్కిపడేలా చేసింది. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఇలాంటిది ఏదో ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదుల తో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడు తున్నారు. ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి గురించి ప్రజలు తెలుసుకోవాలి. సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండింది. ముఖ్యంగా ఎక్కడ ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయి నుంచే ప్రజలు అప్రమత్తం కావాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండాలి. ఈ క్రమంలో ప్రజలు ఇకనుంచి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ఎందుకంటే డాక్టర్లంటే ప్రాణాలు కాపాడాల్సిన వృత్తిలో ఉన్నవారు. వారే మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థల వేటలో తెలియనుంది. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఇది పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం అని గుర్తించాలి. ఈ దేశం గడ్డపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు దేశం ఏమయిన ఆఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఢిల్లీ ఎర్రకోట ఘటన సాయంత్రం దాదాపు 7 గంటల ప్రాంతంలో సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే దిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. వాస్తవాల ను ప్రజల ముందు ఉంచుతాం అని కేంద్రహోంమంత్రి అమిత్ షా తెలిపారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. ఇప్పడు ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఇకపోతే దిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడుతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. పేలుడు ధాటికి పలువురి శరీర భాగాలు ఛిద్రమై..రోడ్డు, వాహనాలపై చెల్లాచెదురుగా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు చెప్పారు. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్‌లోని దుకాణాల అద్దాలూ కూడా పగిలిపోయాయంటే ఎంతటి పేలుడు పదార్థాలు వాడోరో అర్థం చేసుకోవాలి. ఆ సమయంలో అందరూ ప్రాణభయంతో హాహాకారాలు చేస్తూ పరుగులు పెట్టారు. భవనాలు కంపించేంత స్థాయిలో పేలుడు తీవ్రత ఉందని ఓ దుకాణదారు తెలిపాడు. తాను నిలబడిన దుకాణం వణికిపోయింది. కిలోమీటరు దూరం నుంచే పేలుడు తీవ్రత గుర్తించారు. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, ఢిల్లీ మెట్రో స్టేషన్లలో భద్రతా సంస్థలు నిఘా వేశాయి. పుకార్లను నమ్మకూడదని.. ఏదైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం. భారతీయులంతా అప్రమత్తంగా లేకుంటే



# పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరం




**ఆత్మాహుతి బాంబర్‌గా ఉమర్ గుర్తింపు**

**టెర్రరిస్ట్ గ్రూపులో పుల్వామాకు చెందిన వైద్యుడు**

**న్యూఢిల్లీ,నవంబర్11:** దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిన, దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఫరీదాబాద్ ఉగ్ర కుట్రతో సంబంధాలు ఉన్న డా.ఉమర్ మహ్మద్ ఈ పేలుడులో కీలక వ్యక్తి అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. పుల్వామాకు చెందిన ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. అతడి తండ్రి జీహెచ్ నబీ భట్, తల్లి షమీమా బానో. ఉమర్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి.. దాదాపు 10 ఏళ్ల క్రితం ఉద్యోగం నుంచి వైదొలిగారు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉమర్ ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశాడు. కొన్నాళ్లు.. జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా ఉన్నాడు. అనంతరం ఫరీదాబాద్ లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. సోషల్ మీడియా వేదికగా తీవ్రవాద భావజాలానికి గురైన డాక్టర్లలో ఉమర్ కూడా ఒకడు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఉగ్రవాద ఆపరేషన్‌లో పలువురు డాక్టర్లను భద్రతాధికారులు అరెస్టు చేశారు. వారితో ఉమర్‌కు కూడా సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అరెస్టయిన డా.అదిల్‌కు ఉమర్ సన్నిహితుడు అని, గతంలో వీరిద్దరూ అనంత్‌నాగ్‌లో కలిసి పనిచేసినట్లు కనుగొన్నారు. వారి అరెస్టు నేపథ్యంలో భయాందోళనకు గురైన ఉమర్..ఈ పేలుడుకు పాల్పడినట్లు నిఘా వర్గాలు అనుమాని స్తున్నాయి. ఇక, తాజా పేలుడు నేపథ్యంలో ఉమర్ కుటుంబసభ్యులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడి సోదరులు జహూర్, ఆషిక్ నబీలను కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉమర్ తన తల్లికి ఫోన్ చేసి.. లైబ్రరీలో చదువుకోవడంలో బిజీగా ఉన్నందున తనకు ఫోన్ చేయొద్దని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన ఫోన్‌ను కూడా స్విచ్ ఆఫ్ చేశాడు. పేలుడుకు కారణమైన కారులో ఓ వ్యక్తి శరీర భాగాలను అధికారులు గుర్తించారు. ఇవి ఉమర్‌వా, కావా అని తెలుసు కునేందుకు అతడి కుటుంసభ్యుల నుంచి డీఎన్‌ఏ నమూనాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దిల్లీ పేలుడులో ఉమర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వారు తారిఖ్ అహ్మద్ మాలిక్, ఆమిర్ రషీద్, ఉమర్ రషీద్‌గా గుర్తించారు. ఈ క్రమంలో ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డా.ఉమర్ మహమ్మద్ ముఖచిత్రం బయటపడింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో పేలిన వైట్ హ్యుండాయ్ ఐ20కారు ఉమర్‌కు చెందినదిగా పోలీసులు తేల్చారు. ఈ దుర్ఘటనలో 12 మంది మరణించగా, 20 మంది క్షతగాత్రులయ్యారు. దీనిని ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న పోలీసులు.. అతడి ముఖాన్ని యాక్సెస్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జమ్ము కశ్మీర్ అతడి తల్లి, సోదరులను దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. జమ్ము కశ్మీర్, హరియాణా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో సోమవారం అరెస్టైన ఇద్దరు వైద్యులు అదిల్ అహ్మద్ రాథర్, ముజామ్మిల్ షకీల్‌లతో ఇతడికి సాన్నిహిత్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్ని రోజులుగా మాడ్యూల్‌లో ఉన్న ఆ ఇద్దరు కీలక సభ్యులను అరెస్ట్ చేసిన దర్యాప్తు బృందం.. వారి నుంచి సుమారు 2,900 కిలోల అనుమానిత పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుంది. విషయం తెలుసుకున్న ఉమర్.. ఫరీదాబాద్ నుంచి పరారయ్యాడు. అతడు భయాలోందనకు గురై ఇలా ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడినట్టు సమాచారం. ఈ దాడి చేసేందుకు ఉమర్, అతడి సన్నిహితులు అమ్మోనియం నైట్రేట్ ఇంధన ఆయిన్‌ను వినియోగించారు. కారులో డిటోనేటర్‌ను ఉంచి లాల్‌ఖిలా సమీపంలో రద్దీగా ఉండే ప్రదేశంలో ఈ ఉగ్రదాడికి పాల్పడ్డారు. ఎర్రకోట సమీపంలో పేలిన హ్యుండాయ్ ఐ20 వాహనం.. బాదర్‌పూర్ సరిహద్దు నుంజి ఢిల్లీలోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలలో నిక్షిప్తమయ్యాయి. ఆ కారును.. ఔటర్‌రింగ్ రోడ్ నుంచి మధ్యాహ్నం గం.3:19ల ప్రాంతంలో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పార్క్ చేశారు. ఆ తర్వాత మూడు గంటల అనంతరం సాయంత్రం గం.6:30లకు అక్కడి నుంచి బయల్దేరిందని అధికార వర్గాలు తెలిపాయి. అనుమానిత ఆత్మాహుతి దళ సభ్యుడు ఒక్క నిమిషం కూడా ఆ కారును వదిలివెళ్లలేదని పేర్కొన్నాయి. దాడిలో ఉపయోగించిన కారు అనేకసార్లు చేతులు మారిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తొలుత ఆ కారును గురుగ్రామ్‌కు చెందిన సల్మాన్ అనే వ్యక్తి 2025 మార్చిలో ఓఖ్లాలోని దేవేందర్‌కు అమ్మాడు. ఆ తర్వాత దేవేందర్ దానిని అంబాలా వాసికి విక్రయించాడు. ఆ వ్యక్తి నుంచి అమీర్‌కు, ఆపై తారిఖ్, ఉమర్‌లకు చేతులు మారి పుల్వామాకు చేరింది. అక్కడ అమిర్, తారిఖ్, రశీద్‌ల మధ్య సంబంధాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో అమిర్, తారిఖ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు ఢిల్లీ పోలీసులు. ఫరీదాబాద్ నుంచి ఇటీవల అనేక మంది వైద్యులు అరెస్ట్ కాగా.. వారు ఉగ్రవాద దాడికి ప్లాన్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీరిలో అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ) వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ ఒకడు. అతడు.. శ్రీనగర్‌లోని జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రసంస్థకు మద్దతుగా పోస్టర్లు వేస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా తెలుసుకున్న పోలీసులు.. ఈనెల 6న ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఓ ఆసుపత్రిలో అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేయగా.. ముజామ్మిల్ షకీల్ అనే మరో వైద్యుడికి ఇందులో సంబంధం ఉన్నట్టు తేలింది. అతణ్ని ఈనెల 10న అరెస్ట్ చేశారు. షకీల్‌ను అరెస్ట్ చేసిన మాడ్యూల్లోనే ఓ మహిళా వైద్యురాలు షహీన్ షాదిద్‌ను అదుపులోకి తీస్కున్నారు. ఆ సమయంలో ఆమె కారులోంచి ఒక ఏకే-47 రైఫిల్, లైవ్ కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేస్కున్నారు.

# రాజేంద్రనగర్‌లో మొయినుద్దీన్ అరెస్ట్



**విషప్రయోగంతో ప్రజలను మట్టుపెట్టాలని కుట్ర**

**భారీస్థాయిలో రేసిన్ విషం తయారు చేసినట్లు గుర్తింపు**

హైదరాబాద్,నవంబర్11: అరెస్టైన ఉగ్రవాది డాక్టర్ మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుజరాత్ ఏటీఎస్ బృందం రాజేంద్రనగర్ ప్రాంతంలో సయ్యద్ మొయినుద్దీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో కీలక సమాచారం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, మొయినుద్దీన్ భారీ స్థాయిలో విషప్రయోగం చేసి చంపాలని కుట్ర పన్నినట్లు వెల్లడైంది. అతను రెసిన్ అనే ప్రాణాంతక రసాయనాన్ని తయారు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషాన్ని దేవాలయాల నీటి ట్యాంకుల్లో, పబ్లిక్ వాటర్ ట్యాంక్‌లో కలిపి పెద్ద ఎత్తున ప్రజలను చంపాలని కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మొయినుద్దీన్ నుంచి రెసిన్ తయారీలో ఉపయోగించే పలు రసాయన పదార్థాలను గుజరాత్ ఏటీఎస్ స్వాధీనం చేసుకుంది. మొయినుద్దీన్ పాకిస్తాన్ నుంచి వచ్చిన హ్యాండ్లర్ ఆదేశాల మేరకు ఈ విషాన్ని తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా లభించినట్టు అధికారులు తెలిపారు. సయ్యద్ మొయినుద్దీన్ చైనాలో ఓఃఃఈూ పూర్తి చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి, ఆన్‌లైన్ ట్రీట్‌మెంట్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్నాడు. అతనితో పాటు గుజరాత్ ఏటీఎస్ నలుగురిని అరెస్ట్ చేసింది. మోయినుద్దీన్ నుండి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందం విచారణ జరుపుతోంది.

# ఎర్రకోట పేలుడుతో భద్రతా సంస్థల అప్రమత్తం



**రైల్వే, ఎయిర్‌పోర్టుల్లో భద్రత కట్టుదిట్టం**

**క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు**


**న్యూఢిల్లీ,నవంబర్11:** దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో బ్లాస్ట్ తర్వాత భద్రతా సంస్థలను అప్రమత్తం చేశారు. ఈ సంఘటన తర్వాత అన్ని సున్నితమైన ప్రాంతాల్లో అధికారులు నిఘా పెంచారు. ప్రధాన రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్ వద్ద ఢిల్లీ పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, కేంద్ర భద్రతా సంస్థలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. అదనపు సిబ్బందిని మోహరించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. ప్రయాణికులను, వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రాజధానిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు అయిన న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్, హజ్రత్ నిజాముద్దీన్ వద్ద అదనపు పోలీసు దళాలను మోహరించారు. ఏదైనా సంఘటన జరిగితే ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలన్నీ అప్రమత్తంగా ఉన్నాయి. కశ్మీర్ గేట్, సారాయ్ కాలే ఖాన్, ఆనంద్ విహార్ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్స్ వద్ద తనిఖీలను కఠినతరం చేశారు. పోలీసు బృందాలు నిరంతరం ప్రయాణికులను పర్యవేక్షిస్తూ వాహనాల తనిఖీని చేస్తున్నాయి. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే గుర్తించడానికి బస్ టెర్మినల్స్ ఎంట్రీ, ఎగ్జిట్ల వద్ద బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, ఢిల్లీ మెట్రో స్టేషన్లలో భద్రతా సంస్థలు నిఘా వేశాయి. పుకార్లను నమ్మకూడదని.. ఏదైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్ టెర్మినల్, హజ్రత్ నిజాముద్దీన్, సారాయ్ రోహిల్లాతో సహా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఉత్తర రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ హిమాన్షు శేఖర్ తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, పీఆర్‌పీ అదనపు బృందాలను మోహరించినట్లు పేర్కొన్నారు. ప్లాట్‌ఫారమ్‌లు, స్టేషన్ ఆవరణ, ప్రవేశ ద్వారాలపై తనిఖీ కార్యకలాపాలు కొనసాగుతు న్నాయన్నారు. మెటల్ డిటెక్టర్లు, బ్యాగేజ్ స్కానర్లతో సోదాలు చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లలో ఏదైనా అలసత్వాన్ని సహించబోమని రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

# స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా జూబ్లీహిల్స్‌లోనే తిరుగుతున్నారు



**జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్‌లో ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని బెదిరింపులకు దిగుతూ.. మాట వినకపోతే బూతులు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అభ్యర్థి అని చూడకుండా బూతులు మాట్లాడతారా అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న రౌడీయిజం భరించలేక మాగంటి సునీత ఉద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ గూండాల బెదిరింపులకు ఓటర్ల భయపడవద్దని సూచించారు. విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని మాగంటి సునీత అన్నారు. స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా జూబ్లీహిల్స్‌లో తిరుగుతున్నారని తెలిపారు. సురేశ్ యాదవ్ అనే వ్యక్తి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తిరగాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ఏజెంట్లు కూర్చుంటే వాళ్లను కూర్చోనివ్వడం లేదని తెలిపారు.పోలింగ్ బూతుల్లోని టేబుళ్లను బయట పడేస్తున్నారని తెలిపారు. పోలీసులు వారి దగ్గరి టేబుల్స్, చైర్లు లాక్కొని దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. బిర్యానీల్లో డబ్బులు పెట్టి ఓటర్లకు ఇస్తున్నారని చెప్పారు. బిర్యానీ ప్యాకెట్లను చూసి కూడా పోలీసులు వదిలేస్తున్నారని తెలిపారు. కొన్ని బూత్‌ల్లో రిగ్గింగ్ చేస్తున్నారని ఆరోపించారు. వికలాంగులకు వీల్‌చైర్స్ కూడా సరిపడేంతగా పెట్టలేదని తెలిపారు. రజియా అనే అమ్మాయి ఇంటికి వెళ్లి దాడులకు దిగుతున్నారని అన్నారు. ఓటింగ్‌కు ఇంకా నాలుగు గంటల సమయం ఉంది.. దయచేసి ప్రజలంతా బయటకొచ్చి ఓట్లు వేయాలని మాగంటి సునీత కోరారు. జూబ్లీహిల్స్ ఓటర్లు చైతన్యం ప్రదర్శించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవ ర్గాన్ని రౌడీరాజ్యంగా మార్చేశారని తెలిపారు. నవీన్ యాదవ్ మనుషులు వచ్చి రేపు నీ సంగతి చెప్తానని నన్నే బెదిరించారని పేర్కొన్నారు. ఇలాంటి రౌడీ రాజ్యాన్ని అడ్డుకోవాలంటే కేసీఆర్ పార్టీని గెలిపించాలని కోరారు. నా భర్త మాగంటి గోపీనాథ్ ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశాడు.. కానీ ఇంత దౌర్జన్యం ఎప్పుడూ చూడలేదని సునీత అన్నారు. 13వ తేదీవరకు ఎన్ని కుట్రలు చేస్తారో చేయండి.. 14వ తేదీ తర్వాత నేను గెలిచాక అందరి సంగతి చెబుతానని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

# తుఫాను బాధితులకు తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు విడుదల




**హైదరాబాద్, నవంబర్ 11:** మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఈరోజు (మంగళవారం) ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే. ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు.కాగా.. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కేసు నమోదు




**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌లపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, మాలోత్ రాందాస్‌తో పాటు ఎమ్మెల్సీ శంకర్ పోలింగ్ బూత్‌కు రావడంపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఓటర్లను ప్రభావితం చేసేలా తిరుగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.స్థానికేతరులైన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు నియోజకవర్గంలో యథేచ్ఛగా తిరుగుతున్నారు. అధికార కాంగ్రెస్‌కి మద్దతుగా పోలీసులు పనిచేస్తున్నారని మాగంటి సునీత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు..బోరబండలో పలు పోలింగ్ స్టేషన్ల వద్ద కరపత్రాలతో బీఆర్ఎస్ నేతలే ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటోలతో ప్రచారం చేస్తున్నారంటూ పోలీసులకు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు కాంగ్రెస్ నేతలు.కాంగ్రెస్ నేతలకు మాగంటి సునీత వార్నింగ్‌బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేసిన, బెదిరించిన ఊరుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేతలను మాగంటి సునీత హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ అక్రమాలకు తెరతీశారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్‌డీపీ హోటల్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్సీ శంకర్ తన అనుచరులతో హల్‌చల్ చేశారు. మరో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ పెత్తనం చలాయించారు. వెంగళరావునగర్ పోలింగ్ బూత్ వద్ద సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి భర్త మట్టా దయానంద్ ఉన్నారు. ఆలేరు ఎమ్మె ల్యే బీర్ల ఐలయ్య.. రహమత్ నగర్ పోలింగ్ కేంద్రం వద్ద కూర్చొని ఓటర్లతో మాట్లాడారు. దీంతో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

# ఉగ్రవాది మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు




**హైదరాబాద్:** అరెస్టైన ఉగ్రవాది డాక్టర్ మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుజరాత్ ఏటీఎస్ బృందం రాజేంద్రనగర్ ప్రాంతంలో సయ్యద్ మొయినుద్దీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో కీలక సమాచారం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది.సమాచారం ప్రకారం, మొయినుద్దీన్ భారీ స్థాయిలో విషప్రయోగం చేసి చంపాలని కుట్ర పన్నినట్లు వెల్లడైంది. అతను రెసిన్ అనే ప్రాణాంతక రసాయనాన్ని తయారు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషాన్ని దేవాలయాల నీటి ట్యాంకుల్లో, పబ్లిక్ వాటర్ ట్యాంక్‌లో కలిపి పెద్ద ఎత్తున ప్రజలను చంపాలని కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మొయినుద్దీన్ నుంచి రెసిన్ తయారీలో ఉపయోగించే పలు రసాయన పదార్థాలను గుజరాత్ ఏటీఎస్ స్వాధీనం చేసుకుంది.మొయినుద్దీన్ పాకిస్తాన్ నుంచి వచ్చిన హ్యాండ్లర్ ఆదేశాల మేరకు ఈ విషాన్ని తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా లభించినట్టు అధికారులు తెలిపారు. సయ్యద్ మొయినుద్దీన్ చైనాలో పూర్తి చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి, ఆన్‌లైన్ ట్రీట్‌మెంట్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్నాడు. అతనితో పాటు గుజరాత్ ఏటీఎస్ నలుగురిని అరెస్ట్ చేసింది. మోయినుద్దీన్ నుండి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందం విచారణ జరుపుతోంది.

# దుర్గం చెరువులో అక్రమ పార్కింగ్ పేదలకో నీతి పెద్దలకో నీతా హైడ్రా అధికారులపై అనుమానాలు



**కొండాపూర్ :** చెరువుల్లో ఇండ్లను నిర్మించుకున్నారంటూ కూల్చివేస్తున్న హైడ్రా అధికారుల కు ఏకంగా చెరువులోని అక్రమ పార్కింగ్‌ను చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.ఐటీకి కేరాఫ్‌గా, పర్యాటకానికి పేరొందిన దుర్గం చెరువులో అక్రమంగా మట్టి నింపి, వందలాది ప్రైవేట్ బస్సులనుకొంతకాలంగా పార్కింగ్ చేస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై విరుచుకుపడుతున్న హైడ్రా సైతం అటుగా చూడక పోవడంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే అక్రమ పార్కింగ్ కొనసాగుతుందా అన్న ఆరోపణలు వినబడుతున్నాయి.గత ప్రభుత్వ హయాంలో చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే.. ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వం దుర్గం చెరువు అభివృద్ధిని గాలికొదిలేసింది. డ్రైనేజీ మురుగు నీరు చేరుతుండడడంతో వాకర్స్, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే చెరువులోని నీటిలో ఆక్సిజన్ లెవెల్స్ పూర్తిగా తగ్గిపోవడంతో చేపలు చనిపోయాయి. దీనిపై సోషల్ మీడియా వేదికగా అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పటికీ ఎలాంటి స్పందన లేకుండా పోయిందిపార్కింగ్ పై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం : ఇరిగేషన్ ఈఈదుర్గం చెరువులో అక్రమ పార్కింగ్ పై ఫిర్యాదు అందిందని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. దీనిపై నాలుగు రోజుల క్రితం శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశాం. వెంటనే అక్రమ పార్కింగ్ కు పాల్పడుతున్న వారిపై తగు చర్యలు తీసుకుంటాం. చెరువులోని మట్టిని తొలగించి, అభివృద్ధిలోకి తీసుకొస్తామని వెల్లడించారు.

# ఆరోపణలు, విమర్శలతో ప్రశాంతంగా జూబ్లీహిల్స్ పోలింగ్ ఈసీకి అధికార, విపక్షాల ఫిర్యాదు



**జూబ్లీహిల్స్ :**ఎన్నికను అటు అధికార పార్టీ.. ఇటు విపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోలింగ్ సందర్భంగా పలుచోట్ల పార్టీల మధ్య గొడవలు జరిగాయి. మరోవైపు ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గొడవలకు దిగడంతో పాటు స్థానికేతరులను ప్రచారం కోసం తిప్పుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై ఎన్నికల సంఘానికి కంప్లైంట్ చేసింది కాంగ్రెస్ పార్టీ. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో పాటు ఆ పార్టీ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో కోరింది కాంగ్రెస్ పార్టీ.అటు బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్‌పై ఈసీకి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గంలో తిరుగుతూ ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని కంప్లైంట్‌లో ఆరోపించింది బీఆర్ఎస్. జూబ్లీహిల్స్‌లో గెలుపు కోసం తెలంగాణ ఎమ్మెల్యేలు దిగజారి ప్రవర్తిస్తున్నారు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు..పోలింగ్ స్లిప్పులు పట్టుకొని నోట్ల కట్టలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని ఆరోపించిన బీఆర్ఎస్ నేతలు..ఈ ప్రవర్తనతో కాంగ్రెస్ తన ఓటమిని ఒప్పుకుందని చెప్పారు.జూబ్లీహిల్స్ పోలింగ్‌లో రిగ్గింగ్ జరుగుతోందని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. కాంగ్రెస్‌కి ఓటేయకపోతే బయట తిరగనివ్వం అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. నియోజకవర్గంలో రౌడీషీటర్లు తిరుగుతున్నారని ఆమె ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, ఎమ్మెల్యేలకు ఇక్కడ పనేంటి అని సునీత ప్రశ్నించారు. అయితే బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోప ణలు చేస్తున్నార న్నారు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్. ఈసీ నిబంధనల ప్రకారమే తమ పార్టీ నేతలు నడుచు కుంటు న్నారని..తమ పార్టీ నేతలు ఎవరూ నియోజకవర్గంలో లేరని చెప్పారు.పోలింగ్ కేంద్రాల సమీపంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఆరోపించారు. ఆ రెండు పార్టీల నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా కూడా పోలీసులు పట్టించుకోవడం లేదని. దొంగ ఓట్లు వేస్తున్నా కూడా అధికారులు చర్యలు తీసుకో వడం లేదని ఆరోపించారు.పోలింగ్ సందర్భంగా పలుచోట్ల పరస్పరం ఘర్షణకు దిగారు మూడు పార్టీల కార్యకర్తలు. బోరబండ స్వరాజ్ నగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య వివాదం చెలరేగింది. కార్పొరేటర్ ఫసియుద్దీన్ తమపై దాడి చేశారంటూ ఆందోళనకు దిగారు బీఆర్ఎస్ కార్యకర్తలు. దీంతో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను అడ్డుకున్నారు పోలీసులు.ఇక వెంగళరావు నగర్ పోలింగ్ బూత్ నెంబర్ 120 దగ్గర ఓటర్లకు బీఆర్ఎస్ కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారంటూ గొడవకు దిగారు కాంగ్రెస్ కార్యకర్తలు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇదే ఏరియాలో సత్తుపల్లి భర్త దయానంద్‌పై ఆర్వోకి ఫిర్యాదు చేశారు నేతలు. వెంగళరావునగర్ పోలింగ్ బూత్ దగ్గర ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించించింది బీఆర్ఎస్. బీఆర్ఎస్ ఏజెంట్లను బూత్‌లోకి పంపి తనను అడ్డుకున్నారంటూ షేక్‌పేట్ డివిజన్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగారు కాంగ్రెస్ నేత సత్యనారాయణ. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడితో పాటు పోలీసులు సత్యనారాయణకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

# సూర్యాపేటలో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు



**సూర్యాపేట టౌన్, నవంబర్ 11 :** దేశ రాజధాని నగరం ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల సంఘటన నేపథ్యంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది మంగళవారం సూర్యాపేట పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పౌరుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్ ప్రాంగణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టింది. బస్సులు నిలుపు ప్రాంగణాలను, దుకాణాలు, బస్సులు, ప్రయాణికుల లగేజీ, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నివారణ కోసం విస్తృతమైన తనిఖీలు నిర్వహించారు. గుర్తింపు నిర్ధారణ వ్యక్తులకు, అనుమానితులకు లాడ్జ్ ల నందు వసతి ఇవ్వవద్దని నిర్వాహకులకు సూచించారు.

# రేవంత్ రెడ్డి రౌడీయిజానికి మచ్చుతునక ఈ ఉప ఎన్నిక



**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి రౌడీయిజానికి మచ్చుతునన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక అని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మంత్రులంతా తిరిగారు. దుర్మార్గమైన రీతిలో ఎన్నికలు నిర్వహించారు అని ఆయన అన్నారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు.బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో పాటు ఆమె పిల్లలను బెదిరించారు. 139 డ్రోన్లు పెట్టామన్నారు.. సందు సందులో గూండాలున్నారు. అయినా కూడా యువకులు, మహిళలు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లో రాయలసీమ, బీహార్ మాదిరిగా అరాచకం జరిగింది. ఈ ఎన్నికలో విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారు. లక్ష మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డబ్బు వద్దన్న ఓటర్లను బెదిరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఉందా..? లేదా..? 20 సార్లు ఫిర్యాదు చేస్తే ఈసీ స్పందించలేదు. మంత్రులందరూ ఎలక్షన్ రూల్స్‌ను ఉల్లంఘించారు అని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.రాత్రికి రాత్రే వందల మంది దొంగ ఓటర్లను తీసుకొచ్చారు. బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టారు. బీఆర్ఎస్ నేతలను బెదిరించి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఇటువంటి ఎన్నిక గతంలో ఎన్నడూ చూడలేదు. రేవంత్ రెడ్డికి ప్రజల మీద నమ్మకం పోయింది. ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేశాడు. తెలంగాణలో రౌడీయిజం చూపించబోతున్నారు. ఎలక్షన్ కమిషన్ గుడ్డి గుర్రంలా తయారైంది. ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డీజీపీ, సీపీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా మారారు. స్థానికేతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరుగుతున్నారని చెప్పినా పట్టించుకోలేదు. పారామౌంట్ కాలనీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే టేబుల్స్ తీసేశారు. ఒక్క కాంగ్రెస్ నేతపైన అయినా దాడి జరిగిందా..? తప్పుడు ఐడీ కార్డులతో వస్తున్నారు చెక్ చేయమన్నా స్పందన లేదు. పోలింగ్ బూతుల్లో బీఆర్ఎస్ ఏజెంట్లను సైతం బెదిరించారు. బీఆర్ఎస్ నేతలపై అడుగడుగునా దాడులు జరిగాయి. బిర్యాని పొట్లాల్లో డబ్బులు పెట్టి ఇస్తున్నారని చెప్పినా పట్టించుకోలేదు. ఒక్కరి మీదైనా చర్యలు తీసుకొమ్మని సుదర్శన్ రెడ్డిని బతిమిలాడిన కూడా స్పందించలేదని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు.

# జూబ్లీహిల్స్ ఓటర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు




**హైదరాబాద్ :** గత నెలరోజులుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా, బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు అని కేటీఆర్ పేర్కొన్నారు.

బుధవారం,
నవంబర్ 12, 2025

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# పిల్లలకు క్రమశిక్షణ నేర్పిద్దాం!

తల్లిదండ్రులు ఓపికగా వ్యవహరిస్తేనే పిల్లలు చెప్పినమాట విని క్రమశిక్షణ నేర్చుకుంటారు. ఆడుతూ పాడుతూ పిల్లలను దారిలోకి తెచ్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు



పిల్లలను చీటికీ మాటికీ కోప్పడకుండా వాళ్లు చేసే పనులను గమనిస్తూ ఉండాలి.మొదట పిల్లలు చేసిన పనిని పొగిడి చిన్న బహుమతి ఇస్తే చాలు.తరవాత తల్లిదండ్రులు ఏమి చెప్పినా పిల్లలు వినడానికి సిద్ధంగా ఉంటారు.

తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వాళ్లతో మాట్లాడుతూ ఆటలు ఆడించాలి. దీంతో పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే పిల్లలకు మంచి చెడూ వివరించి చెప్పాలి.

పిల్లలు ఏ విషయమైనా చెబుతున్నప్పుడు శ్రద్ధగా వినాలి.తరవాత వాళ్లు అడిగే ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు చెప్పాలి. పిల్లలవైపు చూస్తూ మృదు స్వరంతో లాలనగా సంభాషించాలి. అప్పుడే తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని గుర్తుపెట్టుకోవాలనే భావన పిల్లల్లో కలుగుతుంది.

పిల్లలతో ప్రేమగా,ప్రశాంతంగా,సహనంగా వ్యవహరించాలి.ఇదే క్రమంలో నైతిక విలువలు,మర్యాద, ఇచ్చి పుచ్చుకునే ధోరణి, స్నేహం, దయ,సహాయం లాంటి వాటి గురించి వివరించి చెప్పాలి. దీంతో పిల్లలు పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకోగల్గుతారు.

సమయానికి పడుకోవడం,నిద్ర లేవడం, హోంవర్క్, పుస్తకాలు సర్దుకోవడం,వ్యక్తిగత శుభ్రతల గురించి పిల్లలకు తెలియజెప్పాలి. దీనివల్ల పిల్లలకు స్వీయ క్రమశిక్షణ అలవడుతుంది.

ఇంటి పనుల్లో పిల్లలను భాగస్వాములను చేయాలి. స్నేహితులు, బంధువులతో మాట్లాడే విధానాన్ని వివరించి చెప్పాలి.

స్కూల్ బ్యాగ్ సర్దుకోవడం, డైనింగ్ టేబుల్ క్లీన్ చేయడం, బట్టలు-బొమ్మలను నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచడం లాంటి పనులను పిల్లలకే వదిలివేస్తే వాళ్లలో బాధ్యత,స్వతంత్ర భావాలు పెరుగుతాయి. ముందుజాగ్రత్త అలవడుతుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..? ఆరోగ్యంగా ఉంటారు..!



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి.ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరు చులకు అనుగుణంగా,తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు.మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి.కానీ జీడిపప్పు, బాదం పప్పు అంటే చాలా మందికి ఇష్టంగాఉంటుంది. వాల్ నట్స్‌ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు.అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజు వారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు.వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

**అధిక బరువు తగ్గుతారు..**

వాల్ నట్స్‌లోఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి.మెదడు యాక్టివ్‌గా పని చేసేలా చేస్తాయి.వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి.ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయపడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి.వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది.జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వుతొలగిపోతుంది.

**చర్మ సంరక్షణకు..**

వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది.ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది.అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి.వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది.ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, ఎచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది.ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది.కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

**కండరాల పనితీరుకు..**

వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది.ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది.నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది.అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది.దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది.పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు.వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది.వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండాచూసుకోవచ్చు.

# మీల్ మేకర్ మీరు కూడా తింటున్నారా..? అయితే ఈ పొరపాట్లు అస్సలు చేయకండి..!



మీల్ మేకర్ అనేది ప్రోటీన్ అధికంగా కలిగిన శాకాహార ఆహారం.ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు కండరాల బలాన్ని పెంచుతుంది.అయితే దీన్ని అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు రావొచ్చు.మీల్ మేకర్ ఆరోగ్య ప్రయోజనాలు, దుష్ప్రభావాలను ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

మీల్ మేకర్ అనేది ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, మినరల్స్ కలిగి ఉన్న ఒక పోషకాహారం. ప్రతి 100 గ్రాములలో 52 గ్రాముల ప్రోటీన్, 13 గ్రాముల ఫైబర్, 35 గ్రాముల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇది శరీరానికి కావలసిన ప్రోటీన్ ను అందిస్తుంది. అందువల్ల కోడిగుడ్లు, మాంసం వంటి ఆహారాలకు సమానంగా దీనిని పరిగణించవచ్చు. మీల్ మేకర్ తినడం ద్వారా మన ఆరోగ్యానికి మేలుచేస్తుంది.మీల్ మేకర్‌లో ఉన్న ప్రోటీన్,ఫైబర్ మన శరీరానికి బలాన్నిస్తుంది.శరీరంలోని కండరాలు బలపడేందుకు, శక్తి పెరగడానికిఈ ఆహారం సహాయపడుతుంది.ఈ ఆహారంలో ఉండే విటమిన్లు, మినరల్స్ అనేవి శరీరానికి అవసరమైన పోషకాలుగా పనిచేస్తాయి.ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.శరీరంలోని విటమిన్ లోపాల ను తీరుస్తాయి.ఈ ఆహారం తినడం ద్వారా శారీరక శక్తి పెరుగుతుందంటూ నిపుణులు చెబుతున్నారు.మగవారు ఈ ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురుకావచ్చు.ముఖ్యంగా మీల్ మేకర్ ఎక్కువగా తీసుకున్నప్పుడు ఛాతి పరిమాణం పెరగడం వంటి ఇబ్బందులు రావచ్చు.అలాగే అధిక ప్రోటీన్ తీసుకోవడం వల్ల విరోచనాలు, మలబద్ధకం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సిన అవసరం కూడా ఉండవచ్చు. అందుకే మగవారు ఈ ఆహారాన్ని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.మహిళలు ఈ ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తీసుకుంటే చర్మంపై ప్రభావం చూపవచ్చు.ముఖ్యంగా మొటిమలు వంటి సమస్యలు రావచ్చుఈ ఆహారంలోని కొన్నిరకాల పోషకాలు అధిక మోతాదులో ఉండటంతో శరీరంలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.కనుక మహిళలు కూడా ఈ ఆహారాన్ని సరైన మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.మీల్ మేకర్ తినే ముందు కొంచెం జాగ్రత్తలు తీసుకోవాలి.సాధ్యమైనంత వరకు ఈ ఆహారాన్ని ఓ పోషక ఆహారం అనిపించే స్థాయిలో మాత్రమే తీసుకోవాలి. అత్యధికంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు పొందడంలో కొన్ని ఇబ్బందులు ఉండవచ్చు. కాబట్టి సరైన పరిమాణంలో తీసుకోవడం ద్వారా దీని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

# పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిదేనా..? పెరుగు తినేటప్పుడు ఈ తప్పులు చేయకండి..



పెరుగుతినడం ఆరోగ్యానికి మంచిదే.కానీ పెరుగుతో చక్కెర కలపాలా..?లేక ఉప్పు కలపాలా..?ఏది మంచిదో తెలుసుకోవాలి. ముందుగా ఆయుర్వేదం నిపుణులు ఏంచెబుతున్నారో తెలుసుకుందాం.పెరుగును వేసవిలో ఎక్కువగా తింటారు.ఎందుకంటే ఇది వేడిని తగ్గిస్తుందని భావిస్తారు.కానీ ఆయుర్వేద నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా..?పెరుగు తిన్నాదాని స్వభావం మాత్రం వేడిగానే ఉంటుందని చెబుతున్నారు.

**ఎలా తినాలి..?**

చాలా మంది పెరుగుతో లస్సీ తయారు చేసుకుంటారు.మరికొందరు దానిలో చక్కెర లేదా ఉప్పు కలిపి తింటారు.అయితే పెరుగులో ఏది కలపడం ఆరోగ్యానికి మేలు చేస్తుందో తెలుసుకోవాలి ఆయుర్వేద నిపుణులు చెప్పిన ప్రకారం పెరుగు స్వభావం ఆమ్లంగా ఉంటుంది.దాన్ని ఏదైనా కలపకుండా తినాలి.ఎందుకంటే పెరుగును తప్పుగా తీసుకుంటే రక్తం కలుషితం అవుతుందని చర్మసమస్యలు రావచ్చని చెబుతున్నారు.

**రాత్రి పెరుగు తినొచ్చా..?**

ప్రతిరోజూ పెరుగు తినడం మంచిది కాదు. ముఖ్యంగా రాత్రి పెరుగు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావచ్చు. కానీ పెరుగును తేనె, నెయ్యి, బెల్లంతో కలిపి తింటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు.

**పెరుగులో ఉప్పు..?**

కొన్నిసార్లు పెరుగులో ఉప్పు కలిపి తినొచ్చు. కానీ ఎల్లప్పుడూ ఇలా చేయడం మంచిది కాదు. ఎందుకంటే పెరుగు సహజంగా వేడిగా ఉంటుంది.ఎక్కువ ఉప్పు కలిపితే చర్మసమస్యలుజుట్టు రాలడం,మొటిమలు వంటి సమస్యలు రావచ్చు.

**పెరుగులో చక్కెర..?**

పెరుగుతో చక్కెర కలిపి తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.చక్కెర కలిపితే పెరుగులోని వేడిమి తగ్గి శరీరానికి చల్లదనం లభిస్తుంది.అలాగే బెల్లం కలిపి తింటే కూడా ఆరోగ్యానికి చాలా మంచిది.

**లస్సీ మంచిదేనా..?**

వేసవిలో పెరుగుతో లస్సీ తాగడం వల్ల శరీరానికి మంచి శక్తి లభిస్తుంది.ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి నీటి కొరతను నివారిస్తుంది. అయితే ఏదైనా ఆహారాన్ని మితంగా తీసుకోవడం మంచిది.

# కొబ్బరి నీళ్లు మేలు చేస్తాయని అధికంగా తాగుతున్నారా..? అయితే జాగ్రత్త..!



కొబ్బరి నీళ్లను తాగడం వల్ల మన శరీరానికి ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ప్రకృతి మనకు సహజ సిద్ధంగా అందించిన మధురమైన పానీయం కొబ్బరి నీళ్లు. వీటిని సీజన్లతో సంబంధం లేకుండా ఎప్పుడైనా సరే తాగుతుంటారు. కొబ్బరి నీళ్లు మనకు వేసవిలో దాహాన్ని తీర్చడమే కాదు, ఎండ దెబ్బ బారిన పడకుండా చూస్తాయి.కొబ్బరి నీళ్లను వేసవిలో తాగడం వల్ల శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందుతుంది.అలాగే వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది.అయితే కొబ్బరి నీళ్లు ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మోతాదు లోనే తాగాల్సి ఉంటుంది. పెద్ద మొత్తంలో కొబ్బరి నీళ్లను తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజ నాలు కలగకపోగా అనారోగ్య సమస్యలు వస్తాయి. కొబ్బరి నీళ్లను రోజూ తాగే వారు కచ్చితంగా జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది.

**మోతాదులోనే తాగాలి..**

కొబ్బరి నీళ్లను తాగితే మనకు తాజాదనపు అనుభూతి కలుగుతుంది. శరీరానికి కొత్త శక్తి వచ్చినట్లు అయి ఉత్తేజంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు.అయితే మెడికల్ మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ జమాల్ ఎ.ఖాన్ చెబుతున్న ప్రకారం కొబ్బరి నీళ్లను రోజూ మోతాదుకు మించి తాగితే అందులో ఉండే పొటాషియం గుండెకు హాని చేస్తుందని అంటున్నారు. కొబ్బరి నీళ్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ వాటిల్లో పొటాషియం, సోడియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. కనుక కొబ్బరి నీళ్లను మోతాదుకు మించి తాగితే ఆరోగ్యానికి హాని కలుగుతుందని అంటున్నారు. కొబ్బరి నీళ్లను ఎవరైనా సరే మోతాదులోనే తాగాల్సి ఉంటుంది.కొబ్బరి నీళ్లను అధికంగా తాగడం వల్ల శరీరంలో పొటాషియం లెవల్స్ పెరిగిపోయి హైపర్ కలేమియా అనే సమస్య వస్తుందని అంటున్నారు. దీని వల్ల గుండె అసాధారణ రీతిలో కొట్టుకుంటుంది.కొందరికి ప్రాణాంతక పరిస్థితులు సంభవించేఅవకాశాలుఉంటాయని హెచ్చరిస్తున్నారు.

**వీరు తాగకూడదు..**

వైద్య నిపుణులు చెబుతున్న ప్రకారం కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. కిడ్నీ సంబంధ సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకపోవడమే మంచిది. లేదంటే కొబ్బరి నీళ్ల కారణంగా శరీరంలో చేరే పొటాషియంను కిడ్నీలు బయటకు పంపించలేకపోతే అప్పుడు కిడ్నీలపై భారం పడుతుంది. కనుక ఈ సమస్య ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకూడదు. అలాగే శస్త్ర చికిత్స చేయించుకుంటానికి 2 వారాల ముందు కానీ 2 వారాల తరువాత కానీ కొబ్బరి నీళ్లను తాగవద్దని వైద్యులు చెబుతుంటారు. ఎందుకంటే వీటిల్లో ఉండే పొటాషియం కారణంగా రక్తపోటు నియంత్రణలో ఉండదు. దీని వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

**ఎంత తాగాలి..?**

కిడ్నీ వ్యాధులు లేదా హైబీపీ మందులను వాడేవారు డాక్టర్ సలహా మేరకు కొబ్బరి నీళ్లను తాగవచ్చు. లేదంటే మెడిసిన్ల ప్రభావం మరీ ఎక్కువయ్యే లేదా తక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. అలాగే జీర్ణ సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకపోవడమే మంచిది. కొబ్బరి నీళ్లను ఎవరైనా సరే రోజుకు 1 గ్లాస్ మోతాదులో తాగవచ్చు. వేసవిలో రెండు సార్లు ఇలా రోజుకు తాగవచ్చు. కానీ మోతాదుకు మించితే శరీరంలో పొటాషియం స్థాయిలు ఎక్కువై అది రక్తపోటుపై ప్రభావం చూపిస్తుంది.దీంతో గుండెకు హాని కలుగుతుంది. కనుక అధికంగా కొబ్బరి నీళ్లను తాగుతున్న వారు ఈ విషయాలనుతప్పనిసరిగా గుర్తుంచుకోవాల్సి ఉంటుంది.

# కలల ద్వారా మరణం ముందే తెలుస్తుందా.. నిద్రలో ఇవి కనిపిస్తే ఏం జరుగుతుందో తెలుసా



హిందూ మతంలో కలలకు ఎన్నో అర్థాలున్నాయి.వీటినే ఆత్మలు లేదా దేవదూతల సందేశాలుగా కూడా చూస్తారు.తరచుగా ఒకరి ఆలోచనలు వేటి చుట్టు అయితే తిరుగుతాయో అవే కలల రూపంలో వస్తాయని సైన్స్ చెప్తోంది. కానీ కలలకు అంతకు మించిన నిగూఢార్థం ఏదో ఉందని స్వప్న శాస్త్రం అంటోంది. ఇందులో ఏది నిజం.. అసలు కలలకు భవిష్యత్తును తెలిపే పవర్ ఉందా. కలలో మనం తరచుగా చూసేవాటికి అర్థాలు ఏంటో తెలుసుకుందాం..

మనకు వచ్చే కలలు జీవితంలో మనకు ఎదురయ్యే మంచి మరియు చెడు శకునాలను కూడా సూచిస్తాయి. కొన్నిసార్లు మనస్సు అర్థం చేసుకోలేని లోతైన అర్థాలను కలిగి ఉంటాయి హిందూ మతం ప్రకారం కొన్ని సాధారణ కలలు మరియు వాటి అర్థాలను ఇక్కడ డీకోడ్ చేయొచ్చు.పాములను కలలో చూడటం రాబోయే ఇబ్బందులకు మరియు శత్రువులకు సూచన అని చెబుతారు. మరోవైపు, దీనికి కొన్ని సానుకూల వివరణలు కూడా ఉన్నాయి. పామును పట్టుకోవడం ఆ శత్రువులపై విజయాన్ని సూచిస్తుందని చెబుతారు. ఇది వైద్యం మరియు అంతర్గత జ్ఞానాన్ని కూడా సూచిస్తుంది.

**మరణం ముందే తెలుస్తుందా..**

మరణాన్ని కలలు కనడం చాలా మందికి బాధ కలిగించే అనుభవం కావచ్చు,కానీ అది సాధారణంగా సానుకూల సంకేతం.మీరు చనిపోతున్నట్లు కలలు కన్నట్లయితే, అది సాధారణంగా మీ శక్తిని ఎక్కువగా ఆక్రమిస్తున్న దాని ముగింపును సూచిస్తుంది మరియు కొత్తదానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. ఇది వివాహం, శిశువు లేదా కొత్త ఉద్యోగం వంటి ముఖ్యమైన జీవిత మార్పును కూడా సూచిస్తుంది. మీరు వేరొకరి మరణం గురించి కలలు కన్నట్లయితే, మీరు వారి శ్రేయస్సు మరియు భద్రత కోసం ఆందోళన చెందుతున్నారని అర్థం.

**పసిపిల్లలు**

కలలలో బిడ్డను చూడటం అనేక అర్థాలను కలిగి ఉంటుంది. పసివారు కలలో కనిపించడం స్వచ్ఛతకు మరియు ప్రేమను సూచన అయినప్పటికీ కొన్ని కలవరపెట్టేవిగా కూడా ఉంటాయి. ఉదాహరణకు,ఏడుస్తున్న శిశువు కనిపిస్తే మీరు త్వరలో జీవితంలో కొన్ని నిరాశలను ఎదుర్కోవలసి ఉంటుందని,ముఖ్యంగా మీ ప్రేమ జీవితంలో కొన్ని నిరాశలను ఎదుర్కోవలసి ఉంటుందని అర్థం.మీరు నడవడానికి ప్రయత్నిస్తున్న శిశువును చూస్తే,అది మీ యొక్క బలాన్ని చూపిస్తుంది.

**నీరు..**

నీరు జీవితంలో కీలకమైన అంశం,నీటి గురించి కలలు ఎక్కువగా సానుకూల స్వభావం కలిగి ఉంటాయి. కొత్త నీరు కలలో కనిపిస్తే మంచిదే. మరోవైపు, మీరు ఎవరికైనా డబ్బు అప్పుగా ఇచ్చినప్పుడు, మీరు కలలో నీరు తాగుతున్నట్లు కనిపిస్తే,ఆ డబ్బు మీకు తిరిగి వస్తుందని అర్థం. నీటిపై నడవడం అసమానమైన విజయాన్ని సూచిస్తుంది.

**గుర్రం..**

గుర్రం హిందూ మతంలో ఒక ముఖ్యమైన చిహ్నం. ఇలాంటి కలలు జీవితంలో సానుకూల శకునాలు.మీరు గుర్రపు స్వారీ చేస్తుంటే, కనీసం ప్రస్తుతానికి మీ జీవితం సజావుగా సాగుతుందని అర్థం.మరోవైపు,మీరు పరుగెత్తుతుంటే, జీవితం ఇచ్చే కష్టాలు మిమ్మల్ని పెద్దగా ప్రభావితం చేయవని మీరు వాటిని సులభంగా దాటుతారని అర్థం.


**చెట్టు..**

చెట్టు మీ కలలో పచ్చని చెట్టు కనిపిస్తే, మీరు జీవితంలో సంతృప్తిగా ఉన్నారని అర్థం.అయితే,మీరు ఒక మొక్కను చూసినట్లయితే,మీ దారిలో కొంత అసంతృప్తి వస్తోందని అర్థం. పసుపు చెట్టు కుటుంబంలో ఆసన్నమైన అనారోగ్యాన్ని సూచిస్తుందని చెబుతారు.మీరు ఒక చెట్టు నుండి పండ్లు కోస్తున్నట్లు కనిపిస్తే, మీరు త్వరలో కొంత వారసత్వాన్ని పొందుతారని అర్థం.

**ఏనుగు..**

కలలో ఏనుగు కనిపిస్తే, అది గొప్ప విజయం, బలం మరియు శ్రేయస్సును సూచిస్తుంది. మరోవైపు, సింహాన్ని చూడటం గౌరవం, శక్తి మరియు కీర్తిని సూచిస్తుంది.

# లొట్టలేసుకుంటూ తినే Chicken 65కి.. ఆసలు ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసా?



మాంసాహారులకు ఇష్టమైన వంటకం చికెన్. చికెన్‌తో రకరకాల వంటకాలను తయారు చేసుకుని ఆరగిస్తుంటాం.కానీ ఎప్పుడైనా రెస్టారెంట్‌కి వెళితే మాత్రం అక్కడ చికెన్ బిర్యానీ, చికెన్ లాలిపాప్, చికెన్ తందూరీ వంటివాటితోపాటు చికెన్ 65 కూడా మెనూలో కనిపిస్తుంది. ఇందులో చికెన్ 65 స్పైసీ డిష్ అందరికీ బలేగా ఇష్టం.అందుకే చాలా మంది చికెన్ 65ని ఇష్టంగా తింటారు.అంతర్జాతీయ గుర్తింపు పొందిన చికెన్ 65కు ఆ పేరు రావడం వెనుక ఇంటెరెస్టింగ్ స్టోరీ ఉందట. చికెన్ 65 అనే పేరు ఎలా వచ్చిందనే దానిపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. వాటి గురించి ఇక్కడ తెలుసుకుందాం..

**భారత సైనికుల ప్రత్యేక వంటకం**

చికెన్ 65 అనేది ఇండియన్ సైనికులకు ఇచ్చే ఒక ప్రసిద్ధ వంటకం. దీనిని ప్రత్యేకంగా భారత ఆర్మీ సైనికుల కోసం ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఈ 65 సంఖ్య సైన్యంలోని ఒక నిర్దిష్ట బెటాలియన్‌కు సంబంధించింది. అందుకే ఈ వంటకానికి చికెన్ 65 అని పేరు పెట్టారని చెబుతారు.

**65 రకాల మసాలాలతో తయారు చేస్తారు కాబట్టే దానికా పేరు..**

చికెన్ 65 తయారీకి 65 రకాల మసాలా దినుసులు ఉపయోగిస్తారని, అందుకే ఆ పేరు వచ్చిందని మరో కథనం ప్రచారంలో ఉంది. నిజానికి ఈ చికెన్ 65 వంటకాన్ని తయారు చేయడానికి కొన్ని పదార్థాలు ఉన్నా చాలా. ఇట్టే తయారు చేయొచ్చు. కాబట్టి ఈ పేరు వెనుక ఉన్న కథ కూడా అంత నిజం కాదు.

**కోడి వయస్సుకి, ఈ పేరుకి సంబంధం ఉందా?**

ఆ కోడి వయసు కారణంగా దీనికి చికెన్ 65 అనే పేరు వచ్చిందని మరికొందరు చెబుతారు. ఈ వంటకం తయారు చేయడానికి 65 రోజుల వయసున్న కోడిని ఉపయోగిస్తారట. ఈ వంటకానికి ఈ పేరు ఎలా వచ్చిందో చెప్పే కథల్లో ఇది కూడా ఉంది.

**ఈ పేరు పెట్టడానికి మెనూ నంబర్ కారణం..**

దక్షిణ భారతదేశంలోని ఒక సైనిక క్యాంటీన్‌లో చికెన్ 65 మెనూలో 65వ వంటకం ఇది. గతంలో కస్టమర్‌లు వాటిని సులభంగా గుర్తించడానికి మెనూలకు సంఖ్యలు ఇచ్చేవారు. ఈ సంఖ్య వల్ల ఈ వంటకానికి చికెన్ 65 అనే పేరు వచ్చిందని ఇంకొందరు చెబుతారు.

**చికెన్ 65 చెన్నైలోని బుహారీ హొటల్‌లో పుట్టిందా?**

చికెన్ 65 అనే వంటకం 1965లో తమిళనాడులోని చెన్నైలోని బుహారీ హొటల్‌లో ఉద్భవించిందనే కథ కూడా ప్రచారంలో ఉంది.ఈ వంటకాన్ని బుహారీ హొటల్ వ్యవస్థాపకుడు బుహారీ తొలిసారి తయారు చేశాడని, మొదట్లో హొటల్‌లోని కస్టమర్లకు చికెన్ 65ను త్వరిత స్నాక్‌గా అందించేవారనే కథనం ప్రచారంలో ఉంది.దీని రుచి అద్భుతంగా ఉండటంతో బాగా ఫేమస్ అయిందట. అందుకే ఈ వంటకానికి చికెన్ 65 అనే పేరు పెట్టారని చెబుతారు.

నిజం నిక్కచ్చిగా తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
బుధవారం,
నవంబర్ 12, 2025



# ముంబై ఇండియన్స్‌తో రవీంద్ర జడేజా సీక్రెట్ డీల్..!



ఐపీఎల్‌లో సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ప్రస్తుతం మారుమోగిపోతున్నాయి. ట్రేడింగ్‌కు బంధించి చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య చర్చలు జరుగుతుండడంతో ఎవరు ఏ టీమ్‌లోకి వెళతారని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. మొదట రవీంద్ర జడేజా కోసం మొదట సీఎస్‌కేను రాజస్థాన్ సంప్రదించగా.. కానీ చర్చలు ఫలించలేదు. అదే సమయంలో సంజూ శాంసన్ కోసం ఢిల్లీ కూడా ప్రయత్నించగా.. ఇవి కూడా విఫలమయ్యాయి. మొత్తానికి ఫైనల్‌గా సంజూ శాంసన్‌ను తీసుకునేందుకు చెన్నై ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. సీఎస్‌కే నుంచి రవీంద్ర జడేజాతోపాటు సామ్ కర్రాన్ లేదా మతిషా పతిరానాను తమకు ఇవ్వాలని రాజస్థాన్ కోరుతోంది. ఈ వారంలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. రవీంద్ర జడేజా ఐపీఎల్‌లో మొదట రాజస్థాన్ రాయల్స్‌తోనే ఎంట్రీ ఇచ్చాడు. 2008 మొదట సీజన్‌లో షేన్ వార్న్ నాయకత్వంలో రాజస్థాన్ ఛాంపియన్‌గా నిలిచిన టీమ్‌లో రవీంద్ర జడేజా సభ్యుడిగా ఉన్నాడు. ఆ తరువాత సీజన్‌లోనూ రాజస్థాన్‌కు ఆడిన జడేజా.. ఆ తరువాత చేసిన ఓ తప్పుతో ఒక సీజన్ నిషేధానికి గురయ్యాడు. 2010లో జడేజా తన ఫ్రాంచైజీ రాజస్థాన్‌కు తెలియజేయకుండా ముంబై ఇండియన్స్‌కు మారడానికి ప్రయత్నించాడు. ముంబై ఫ్రాంచైజీతో చర్చలు జరపడంతో %ఖూూ% గవర్నింగ్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఒక సీజన్ మొత్తానికి జడేజాపై వేటు వేసింది. ఆ సమయంలో ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న లలిత్ మోడీ మాట్లాడుతూ.. %ఖూూ% గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఆటగాళ్ల మార్గదర్శకాలు చాలా ముఖ్యమైనవి అని.. ప్రతి ఆటగాడు తప్పకుండా పాటించాలని అన్నారు. జడేజా తన ఫ్రాంచైజీకి తెలియకుండా మరో టీమ్‌తో చర్చలు జరపడం నిబంధనలకు విరుద్ధమని.. అందుకే ఏడాది నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. దీంతో రవీంద్ర జడేజాను 2010లో రాజస్థాన్ రాయల్స్ టీమ్ నుంచి విడుదల చేసింది. ఆ తరువాత సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చిన జడేజా.. కొచ్చి టస్కర్స్ కేరళ తరపున ఆడాడు. ఆ సీజన్‌లో 14 మ్యాచ్‌ల్లో 283 పరుగులు, ఎనిమిది వికెట్లతో మంచి ప్రదర్శన చేశాడు. 2012 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లో చేరాడు. ఆ వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో జడేజా ఒకటిగా నిలిచాడు. అప్పటి నుంచి సీఎస్‌కే జడేజా ప్రయాణం కొనసాగుతోంది. 2016, 2017లో రెండు సీజన్లు చెన్నై టీమ్‌పై నిషేధం విధించినప్పుడు.. సురేష్ రైనా నాయకత్వంలో గుజరాత్ లయన్స్ టీమ్‌కు జడేజా ప్రాతినిధ్యం వహించాడు. ఆ తరువాత మళ్లీ సీఎస్‌కే టీమ్‌కు తరుపున ఆడాడు. చెన్నై ఐదు టైటిళ్లు గెలవగా.. మూడు టైటిళ్లను గెలవడంలో జడేజా కీలక పాత్ర పోషించాడు. 2023 ఫైనల్‌లో జడేజా ఇన్నింగ్స్ మరపురానిది. మోహిత్ శర్మ వేసిన చివరి ఓవర్‌లో జడేజా అద్భుతంగా ఆడి టీమ్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. 2022 సీజన్‌లో చెన్నైకు టీమ్‌కు కొన్ని మ్యాచ్‌లు కెప్టెన్‌గా వ్యవహరించినా.. సక్సెస్ కాలేకపోవడంతో ఆటగాడిగా కొనసాగుతున్నాడు.



# ఇంకా కోలుకుని శ్రేయాస్ అయ్యర్..

భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ స్వదేశానికి తిరిగి వచ్చాడు. గాయం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. అయ్యర్ పరిస్థితి మొదట అనుకున్న దానికంటే చాలా తీవ్రంగా ఉంది. ఈ సంఘటన తర్వాత ఒక సమయంలో, అతని ఆక్సిజన్ లెవల్స్ 50 కి పడిపోయింది. "అతను దాదాపు 10 నిమిషాలు సరిగ్గా నిలబడలేకపోయాడు. అతని చుట్టూ పూర్తిగా బ్లాక్‌అవుట్ ఏర్పడింది. అతను సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుంది" అని భారత బోర్డుకు ఒకరు తెలిపారు. నవంబర్ 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ పాల్గొనడంపై ఇంకా సందేహాలు ఉన్నాయి. నవంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్ట్ మ్యాచ్‌ల తర్వాత, భారత్ రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలో మూడు వన్డేలు ఆడనుంది. ఇటీవలే ఆస్ట్రేలియా నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన అయ్యర్ తనకు తగిలిన గాయం నుండి ఇంకా కోలుకోలేదని తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి ఫిట్‌గా ఉండటానికి మరింత సమయం అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. అయ్యర్ ఆరోగ్య స్థితి గురించి సెలక్షన్ కమిటీకి సమాచారం అందింది. వైద్య నివేదికల ప్రకారం అతను ఫిట్‌గా ఉండటానికి దాదాపు ఒక నెల కన్నా ఎక్కువ సమయం పడుతుందని పేర్కొన్నారు. "అతను పూర్తిగా ఫిట్‌గా ఉండటానికి ఎక్కువ సమయం పడుతుంది. అతని గాయం తర్వాత బోర్డు, సెలక్షన్ కమిటీ తొందరపడటంలేదు. దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌లో అతను ఆడటం సందేహమే" అని భారత బోర్డులోని ఒక వర్గాలు ధృవీకరించాయి. అతను సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుందని భావిస్తున్నారు. గత వారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన 3వ వన్డే సందర్భంగా గాయపడిన అయ్యర్‌ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అలెక్స్ కారీని అవుట్ చేయడానికి డైవింగ్ క్యాచ్ తీసుకుంటూ అయ్యర్ నేలపై పడి గాయపడ్డాడు. పొత్తికడుపులో ప్లీహానికి గాయం కావడంతో అంతర్గత రక్తస్రావంతో ఆయనను సిడ్నీ ఆసుపత్రిలో చేర్చారు.

# డిసెంబర్ 17నుండి ఐపీఎల్ మినీవేలం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మినీ-వేలం తేదీ, వేదిక గురించి కీలక అప్‌డేట్ వెలువడింది. సాధారణంగా డిసెంబర్ నెలలో జరిగే ఈ వేలానికి సంబంధించి, అధికారికంగా తేదీలు ఖరారు కానప్పటికీ, కీలకమైన నివేదికలు వేలం ఎప్పుడు, ఎక్కడ జరగనుందో స్పష్టం చేస్తున్నాయి. ఐపీఎల్ మినీ-వేలం 2026 ను డిసెంబర్ 17 లేదా 18 తేదీల్లో నిర్వహించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు నివేదిస్తున్నాయి. మెగా-వేలం జరిగిన తర్వాత (2025 సీజన్‌కు మెగా-వేలం జరిగింది), ఆ తరువాతి సీజన్‌కు (2026) సాధారణంగా మినీ-వేలం నిర్వహిస్తారు. ఈ వేలంలో ఫ్రాంచైజీలు తమ పర్స్‌లో మిగిలిన డబ్బుతో పాటు, విడుదల చేసిన ఆటగాళ్ల ఖర్చును జోడించుకుని వేలంలో పాల్గొంటాయి. డిసెంబర్ మధ్యలో ఈ ఈవెంట్‌ను నిర్వహించడం అనేది ప్రతీ ఏటా జరిగే ప్రక్రియలో భాగమే. ఐపీఎల్ వేలం చరిత్రలో ఒక ముఖ్యమైన మార్పుగా, 2026 మినీ-వేలాన్ని దుబాయ్‌లో నిర్వహించడానికి బీసీసీఐ ప్లాన్ చేస్తోందని తెలుస్తోంది. గతంలో కూడా ఐపీఎల్ వేలాన్ని ఒకసారి విదేశంలో నిర్వహించారు. దుబాయ్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రం కావడంతో, అన్ని ఫ్రాంచైజీల యజమానులు, ముఖ్యంగా విదేశీ యజమానులు, మేనేజ్‌మెంట్ బృందాలు సులభంగా వేలంలో పాల్గొనేందుకు ఇది అనుకూలమైన వేదిక. ఈ ఈవెంట్‌కు మరింత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఐపీఎల్ వేలాన్ని బెంగళూరు, జైపూర్, కోల్‌కతా, మరియు కొచ్చి వంటి భారతీయ నగరాల్లో నిర్వహించారు. దుబాయ్‌లో వేలాన్ని నిర్వహించడం ఐపీఎల్ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలవనుంది. ఈ తేదీ, వేదికపై తుది నిర్ణయం బీసీసీఐ ద్వారా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అయితే, సాధారణంగా మీడియా నివేదికలు సరైనవే అవుతుంటాయి. నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో బీసీసీఐ ఈ వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. జట్లు ఇప్పటికే తమ రిటెన్షన్ జాబితాలను సిద్ధం చేసి, ఏ ఆటగాళ్లను వేలంలోకి పంపించాలో నిర్ణయించుకుంటున్న తరుణంలో, ఈ అప్‌డేట్ ఐపీఎల్ అభిమానులకు ఉత్సాహాన్నిస్తోంది.

# టీమిండియా టీ20 ప్రపంచ కప్‌కు సిద్ధం

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీ20 ప్రపంచ కప్‌నకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న ఈ పొట్టి ప్రపంచ కప్‌నకు భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన టీం ఇండియా మరోసారి తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తోంది. దీని కోసం, రాబోయే 10 మ్యాచ్‌లకు పూర్తిగా సిద్ధమవుతోంది. అంటే, టీ20 ప్రపంచ కప్‌నకు ముందు భారత జట్టు స్వదేశంలో 10 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత నేరుగా షార్ట్ వరల్డ్ కప్‌లో పాల్గొంటుంది. షార్ట్ వరల్డ్ కప్‌లో మొత్తం 20 జట్లు పోటీ పడనున్నాయి. ఇందులో భారత జట్టు లీగ్ దశలో 3 మ్యాచ్‌లు ఆడటం ఖాయం. అలాగే, భారత జట్టు తదుపరి దశకు చేరుకుంటే, మరో నాలుగు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. రాబోయే టీ20 ప్రపంచ కప్ గ్రూప్ ఫార్మాట్‌లో జరగనున్నందున, మొదటి దశలో గ్రూప్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత, సూపర్-10 మ్యాచ్‌లు జరుగు తాయి. ఈ మ్యాచ్‌లన్నింటికీ ముందు, టీమిండియా దక్షిణా ఫ్రికా, న్యూజిలాండ్‌తో తలపడుతుంది. అంటే, డిసెంబర్‌లో భారత జట్టు దక్షిణాఫ్రికాతో 5 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత, జనవరిలో న్యూజిలాండ్ జట్టుతో భారత్ 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌ల ద్వారా టీమిండియా టీ20 ప్రపంచ కప్‌కు సిద్ధమవుతుంది. దీని ప్రకారం, టీ20 ప్రపంచ కప్‌నకు ముందు భారత జట్టు ఆడనున్న టీ20 మ్యాచ్‌ల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

# సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌కు భారత జట్టు ప్రకటన

- బౌలింగ్ కూర్పుపై మేనేజ్‌మెంట్ తర్జనభర్జన



భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభం కానుంది. అయితే, ఈ సిరీస్‌కు ముందు, భారత జట్టు ప్లేయింగ్ ఎలెవన్ ఎంపిక విషయంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు, రిషబ్ పంత్ పునరాగమనం, ధ్రువ్ జురెల్ అద్భుతమైన ప్రదర్శన జట్టు కలయిక విషయంలో కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌లను సందిగ్ధంలో పడేశాయి. రిషబ్ పంత్ తిరిగి రావడం ఇప్పటికే ముందే నిర్ణయించిన విషయం. వైస్ కెప్టెన్‌గా, ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతని స్థానం ఖచ్చితంగా ఉందని భావించారు. అయితే, సమస్య పంత్ కాదు, కానీ ధ్రువ్ జురెల్, అతను అరంగేట్రం చేసినప్పటి నుంచి దాదాపు ప్రతి సందర్భంలోనూ అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. అతని స్థిరమైన ప్రదర్శనలు, ఇండియా ఏ తరపున అతను చేసిన ఇటీవలి సెంచరీతో ఈ ప్లేయర్‌ను విస్మరించడం కష్టతరం చేశాయి. ఇంగ్లాండ్‌లో పంత్ గాయం తర్వాత, జురెల్ జట్టులో స్థానం సంపాదించాడు. అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. అందువల్ల, అతన్ని ఇప్పుడు తొలగిస్తే, అది అతనికి అన్యాయం అవుతుంది. ఎందుకంటే అతను అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి మధ్య కఠినమైన నిర్ణయం తీసుకోవడంలోనే పరిష్కారం ఉందని భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు. యువ బ్యాట్స్‌మన్‌ను త్యాగం చేయాల్సిన అవసరం ఉన్నా, జురెల్‌కు భారత జట్టులో చోటు కల్పించాలి అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో చెప్పుకొచ్చాడు. "ధృవ్ జురెల్, రిషబ్ పంత్ ఇద్దరూ జట్టులో ఉన్నారు. పంత్ వైస్ కెప్టెన్, అతను ఆడాలి. కానీ జురెల్ కూడా ఆడాలని నేను అనుకుంటున్నాను. ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతనికి చోటు కల్పించాలి. "సాయి సుదర్శన్ నంబర్ 3 లో ఆడాలని నేను నమ్ముతున్నాను. మీరు ఇప్పటివరకు నితీష్ కుమార్ రెడ్డికి ముఖ్యమైన బౌలింగ్ పాత్ర ఇవ్వలేదు. కాబట్టి, మీరు అతన్ని వదిలివేసి ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వవచ్చు" అని ఆయన అన్నారు. చోప్రా అభిప్రాయం ఇటీవలి గణాంకాల ఆధారంగా ఉంది. ఈ సీజన్‌లో భారత జట్టు తరపున రెడ్-బాల్ క్రికెట్‌లో ధ్రువ్ జురెల్ బ్యాటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. అక్టోబర్‌లో వెస్టిండీస్‌పై అతను 125 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా ఏపై అజేయంగా 132లి పరుగులు చేశాడు. అతని దేశీయ రికార్డు కూడా అద్భుతమైనది. మరోవైపు, నితీష్ కుమార్ రెడ్డి ఏ తప్పు చేయలేదు. కానీ, జట్టు యాజమాన్యం, కెప్టెన్ అతన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదు. గత టెస్ట్ సిరీస్‌లో, 21 ఏళ్ల అతను రెండు మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. అది ప్రభావం చూపడానికి సరిపోలేదు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్ గెలవాలి

- టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్



వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో ఫైనల్ చేరాలంటే సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో విజయం సాధించాలని టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ అన్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన సౌతాఫ్రికాను ఓడిస్తే డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రస్థానంలో నిలువవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ సైకిల్‌ను టీమిండియా డ్రాతో ప్రారంభించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా 61.5 విన్నింగ్ పర్సంటేజ్‌తో మూడో స్థానంలో కొనసాగుతుంది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్-2లో కొనసాగుతున్నాయి. గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా తృటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. అగ్రస్థానంలో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఫైనల్ చేరాయి. సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ప్రారంభం కానుంది. కోల్‌కతా వేదికగా తొలి మ్యాచ్ జరగనుండగా.. ఇరు జట్లు ముమ్మరంగా సాధన చేస్తున్నాయి. ఈ సిరీస్‌కు ముందు పాకిస్థాన్‌లో పర్యటించిన సౌతాఫ్రికా రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసుకుంది. సౌతాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన సిరాజ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్ ఈ నయా డబ్ల్యూటీసీ సైకిల్‌కు చాలా కీలకం. ప్రత్యేకించి సౌతాఫ్రికా డిఫెండింగ్ ఛాంపియన్ కాబట్టి ఆ జట్టును ఓడిస్తే ఫైనల్ చేరే అవకాశాలు మెరుగవుతాయి. ఆ జట్టు పాకిస్థాన్‌తో 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. మా ఫామ్‌పై మాకు నమ్మకం ఉంది. మేం సానుకూల వాతవరణాన్ని సృష్టించాం. ఇంగ్లండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేశాం. వెస్టిండీస్‌పై సిరీజ్ గెలిచాం. వ్యక్తిగతంగా నేను మంచి లయతో బౌలింగ్ చేస్తున్నాను. దానిని సద్వినియోగం చేసుకోవాలను కుంటున్నాను. బలమైన జట్టుతో ఆడుతున్నప్పుడు మెరుగు పర్చుకోవాల్సిన అంశాలు ఏంటో తెలుస్తాయి.

## నిర్మాత బెల్లంకొండ సురేశ్‌పై భూకబ్జా కేసు.. ఫిల్మ్‌నగర్‌లో కలకలం



ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బెల్లంకొండ సురేశ్‌పై భూకబ్జా ఆరోపణలతో కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని ఖరీదైన ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో తన ఇంటిని సురేశ్, ఆయన అనుచరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ శివ ప్రసాద్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే.. ఫిల్మ్‌నగర్ రోడ్ నం.7లో ఉన్న తన ఇంటికి శివ ప్రసాద్ తాళం వేసి, కొంతకాలంగా బంధువుల వద్ద ఉంటున్నారు. ఇదే అదనుగా భావించిన బెల్లంకొండ సురేశ్, తన మనుషులతో కలిసి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా ఇంట్లోని ఫర్నిచర్‌తో పాటు ఇతర సామగ్రిని ధ్వంసం చేసి, గోడలను పాడుచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.కొన్నాళ్ల తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన శివ ప్రసాద్, లోపలి దృశ్యాలు చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయంపై మాట్లాడేందుకు తన సిబ్బందిని బెల్లంకొండ సురేశ్ ఇంటికి పంపగా, అక్కడ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుందని, వారిపై దాడికి కూడా ప్రయత్నించారని ఆయన వివరించారు.శివ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఫిల్మ్‌నగర్ పోలీసులు.. బెల్లంకొండ సురేశ్‌పై బీఎన్‌ఎస్ 329(4), 324(5), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఈ తీవ్ర ఆరోపణలపై బెల్లంకొండ సురేశ్ వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## 'రాబందు' సినిమా ట్రైలర్ విడుదల చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రీతి నిగమ్, రామ్, భాను ప్రసాద్, సురేశ్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త చిత్రం 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. పులిజాల ఫిల్మ్స్ పతాకంపై పులిజాల సురేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి ట్రైలర్‌ను ఆవిష్కరించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు సముద్ర ఒక లిరికల్ సాంగ్‌ను విడుదల చేయగా, నటి ప్రీతి నిగమ్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ వేడుకలో సెన్సార్ బోర్డు సభ్యులు ఉపేంద్ర, రేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు జయశేఖర్ కల్లు మాట్లాడుతూ.. "సమాజంలో జరుగుతున్న కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా భారీ యాక్షన్ నేపథ్యంలో 'రాబందు' చిత్రాన్ని నిర్మించాం. మా సినిమా ట్రైలర్‌ను మంత్రి కోమటిరెడ్డి గారు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. నిర్మాత సురేశ్ గారు నాపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చారు. సినిమా అద్భుతంగా వచ్చింది. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. త్వరలో విడుదల కానున్న మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నాను" అని తెలిపారు.అనంతరం దర్శకుడు సముద్ర మాట్లాడుతూ.. "దర్శకుడు జయశేఖర్ నాకు మంచి స్నేహితుడు. ఇది ఆయనకు నాలుగో సినిమా. 'యానిమల్' సినిమా లాగే



'రాబందు' అనే టైటిల్ చాలా మాస్‌గా, వైలెంట్‌గా ఉంది. టైటిల్‌కు తగ్గట్టే సినిమా కూడా ఉంటుందని ఆశిస్తున్నా. ఈ చిత్రం నటీనటులతో పాటు నిర్మాత, దర్శకుడికి మంచి విజయాన్ని అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. ఆయన వ్యాఖ్యలతో సినిమాపై ఆసక్తి పెరిగింది.

## ఇకపై అలాంటి పాత్రలు చేయను : మీనాక్షి చౌదరి



టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్న యువ హీరోయిన్ మీనాక్షి చౌదరి తన కెరీర్ విషయంలో ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో పిల్లల తల్లిగా కనిపించే పాత్రలు చేయబోనని ఆమె తేల్చి చెప్పారు. 'హిట్ 2' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని, ఆపై 'గుంటూరు కారం'లో మహేశ్ బాబు సరసన మెరిసిన ఈ బ్యూటీ, ప్రస్తుతం ఇండస్ట్రీలో బిజీగా రాణిస్తున్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మీనాక్షి, తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన 'లక్కీ భాస్కర్' సినిమాలో కథ నచ్చడం వల్లే తల్లి పాత్రలో కనిపించాను. అయితే భవిష్యత్తులో అలాంటి పాత్రలు వస్తే మొహమాటం లేకుండా 'నో' చెబుతాను. నటిగా ఎలాంటి పాత్ర అయినా చేయాలి, కానీ కొన్ని పరిమితులు పెట్టుకోవడం అవసరం" అని ఆమె స్పష్టం చేశారు. సీనియర్ హీరోలతో కలిసి నటించడం తనకు ఇబ్బంది కాదని, దానిని ఒక కొత్త జానర్‌గా భావిస్తానని ఆమె పేర్కొన్నారు.

'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మీనాక్షి, 'హిట్ 2'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అగ్ర హీరోల సరసన నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు. "చిరంజీవి గారితో చేస్తున్న విశ్వంభర సినిమా నా కెరీర్‌లో ఒక స్పెషల్ చాప్టర్‌గా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అలాగే, వెంకటేశ్‌తో కలిసి నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా షూటింగ్‌ను కూడా ఎంతో ఆస్వాదించానని తెలిపారు.

తనపై వచ్చే రూమర్ల గురించి కూడా మీనాక్షి స్పందించారు. "నా గురించి ఏదైనా విషయం చెప్పాలంటే నేనే స్వయంగా చెబుతాను. నాకు సోషల్ మీడియా ఉంది. కాబట్టి అనవసరమైన వదంతులను ఎవరూ సృష్టించాల్సిన పనిలేదు" అంటూ పుకార్లకు ఘాటుగా సమాధానమిచ్చారు.

## చై-అఖిల్‌కి ఆ ధైర్యం లేదు: నాగ్




ఆర్జీవీ తెరకెక్కించిన కల్ట్ క్లాసిక్ %-%శివ%-% దాదాపు 36 ఏళ్ల తర్వాత థియేటర్లలో రీరిలీజవుతున్న సంగతి తెలిసిందే. 4కేలో రీమాస్టర్ చేసిన వెర్షన్ ను డాల్బీ సౌండ్ తో సినిమా నవంబర్ 14న విడుదలకు సిద్ధంగా ఉంది. తాజాగా ప్రీమియర్ వీక్షించిన తరవాత దీనికి అద్భుత స్పందనలు వస్తున్నాయని చిత్రబృందం వెల్లడించింది. ప్రత్యేక ప్రీమియర్ వీక్షించిన నాగార్జునకు మూడు ఆసక్తికర ప్రశ్నలు ఎదురయ్యాయి. వీటిలో నాగచైతన్య, అఖిల్ ఈ సినిమాను ఎప్పుడైనా రీమేక్ చేయాలని అనుకున్నారా? అని ప్రశ్నించగానే, అందుకు వారికి ధైర్యం లేదని నాగార్జున నవ్వేసారు. ఈ సినిమాను తనకు ఇచ్చిన ఆర్జీవీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇది లైఫ్ లో ఒకసారి మాత్రమే ఎదురయ్యే అనుభవం. నాన్న (ఏఎన్నార్) గారు ఈ సినిమా చూసిన రెండు రోజుల తర్వాత నన్ను డ్రైవ్ కి తీసుకెళ్లి సినిమా పెద్ద హిట్! అని అన్నారు... అని తెలిపారు. సినిమా చూసాక రకరకాల కామెంట్లు విన్నానని నాగ్ నాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. రీమాస్టర్ వెర్షన్ చూసాక మళ్లీ కొత్త సినిమా చూస్తున్నానా? అన్న ఫీలింగ్ కలిగిందని నాగ్ అన్నారు. ఇదే వేదికపై చిత్ర దర్శకుడు ఆర్జీవీకి కొన్ని ఆసక్తికర ప్రశ్నలు ఎదురయ్యాయి. మరోసారి నాగార్జునతో కలిసి పనిచేస్తారా? అని ప్రశ్నించగా.. నేను మరొక సినిమా కోసం నాగార్జునను సంప్రదించాలంటే, హిట్ ఇచ్చిన తర్వాతే అలా చేస్తానని అన్నారు. 90లలో శివ ట్రెండ్ సెట్టర్ మూవీగా నిలవడంలో ఆర్జీవీ దర్శకత్వ ప్రతిభతో పాటు, నాగార్జున, రఘువరణ్ ల నటన, ఇళయరాజా మ్యూజిక్ కలిసొచ్చాయి. తన తొలి సినిమాతోనే ఆర్జీవీ మ్యాజిక్ మొదలైంది. ఈ సినిమాలో సైకిల్ చైన్ సీన్ ని నాగార్జునతో ఎలా చేయించానో ... దానిని ఎలా అంగీకరించాడో ఆశ్చర్యంగా ఉందని ఆర్జీవీ అన్నాడు. శివ చిత్రం నాగార్జునకు అంకితం అని అన్నారు. నేను రాత్రి అనే చిన్న సినిమా చేయాలనుకున్నప్పుడు నాగార్జున కోసం కథ రాయమన్నారు నిర్మాత వెంకట్. అప్పటికి నేను బ్రూస్ లీ %-%రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్%-% చిత్రాన్ని 50వ సారి చూసాను. ఆయనకు అంతటి అభిమానిని.. ఆ సినిమాలో రెస్టారెంట్ బ్యాక్ డ్రాప్ ని శివ కోసం కాలేజీ నేపథ్యంలో ఉపయోగించానని వర్మ తెలిపారు. నా కాలేజీ అనుభవాలన్నిటినీ కలిపి 20నిమిషాల్లోనే వన్ లైన్ తో రెడీ అయ్యానని తెలిపారు.

## చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..?




మహిళల శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు'లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.

## ఓటీటీకి 100 కోట్ల సినిమా .. 'డ్యూడ్'



ప్రేమకథలకు యూత్ ఆడియన్స్ సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. ప్రేమకథలో ఫీల్ ఉండాలే గానీ, వాళ్లు ఆ కంటెంట్ కి కటౌట్ పెట్టేస్తారు. వందల కోట్ల వసూళ్లను ముట్టజెప్పేస్తారు. అలాంటి సినిమాల జాబితాలోనే 'డ్యూడ్' కూడా చేరిపోయింది. ప్రదీప్ రంగనాథన్ .. మమిత బైజు జంటగా నటించిన ఈ సినిమా, అక్టోబర్ 17వ తేదీన థియేటర్లకు వచ్చింది. 35 కోట్లతో నిర్మించిన ఈ సినిమా, చాలా తేలికగా 100 కోట్లను వసూలు చేసి పెట్టింది. కీర్తీశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను, కొత్త కోణంలో ఆవిష్కరించారు. కథలోని కొత్త పాయింట్ యూత్ కి ఎక్కేసింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను 'నెట్ ఫ్లిక్స్'వారు దక్కించుకున్నారు. ఈ సినిమాను ఈ నెల 14వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు.


Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com